Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

మంగళవారం TUESDAY || 02.09.2025 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 26 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah




## షాంఘైలో దౌత్య విజయం



2వ పేజీ లో...

## ఎంపిలు విజ్ఞులు ఆలోచించే ఓటేస్తారు

హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): ఎన్నికల ప్రక్రియ ప్రమాదంలో పడబోతోంది అని ఉప రాష్ట్రపతి 'ఇండి' కూటమి అ భ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సం ఘం అత్యున్నతమైన వ్యవస్థ అని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా చిత్తు కాగితం కాదని అన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జరగబోయే ఎ న్నికలో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండి' అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రె డ్డి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

2వ పేజీ లో...



## మహిళల అభివృద్ధిలో...
# తెలంగాణ రోల్ మోడల్









2వ పేజీ లో...

హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మల్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిస్థితిని రాష్ట్రం లో ఏర్పాటు చేస్తు న్నామని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువులు చేప పిల్లల పెంపకానికి రూ.122 కోట్లు విడుదల చేశా మని డిప్యూటీ సీఎం తెలిపారు.

## బతుకమ్మ కార్నివాల్




హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): టూరిజం శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలు కార్నివా ల్ స్థాయిలో నిర్వహించనున్నట్లు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాణిరుద్రమ, సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మ, హజారే మంగమ్మ వంటి ధీనవనితలు పుట్టిన నేల ఓరుగల్లు అని ఆమె తెలిపారు. అటువంటి వరంగల్ జిల్లాలో బతుకమ్మ వేడుకలను మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని ఆమె తెలిపారు. తాను, మంత్రి సీతక్క, టూరిజం ఎండి క్రాంతి ముగ్గు రం మహిళమేనని, టూరిజం శాఖ తరపున నిర్వహించే తొలి బతుకమ్మ వేడుకలను విజయవం తం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. సోమవారం సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, టూరిజం కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతి, సాంస్కృతిక విభాగం సంచాలకులు మామిడి హరికృష్ణ, బతుకమ్మ పండుగ నిర్వాహకురాలు దిల్లీశ్వరితో కలిసి మంత్రి కొండా సురేఖ సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ పోస్టర్‌ను విడుదల చేశారు.

2వ పేజీ లో...

## కెసిఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట : మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కుటుంబంలో మూడు ముక్కలాట చివరి దశకు చేరిందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలతో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని రుజువైందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ తప్పు చేశారా ? లేక హరీష్ రావు చేశారా? అనేది తమకు అనవసరమని, వారి హయాంలో అవినీతి జరిగిందనేది కవిత స్పష్టం చేశారని ఆయన తెలిపారు. కుటుంబ కలహాలను తమపై రుద్దడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ అవినీతిని ఎండ గట్టడమే తమ లక్షం తప్ప కుటుంబ తగాదాలతో సంబంధం లేదని ఆయన వివరించారు. తాము తప్పు చేయలేదని అంటున్న బిఆర్ఎస్ నాయకులు సిబిఐ విచారణ అనగానే ఎందుకు జంకుతున్నారని ఆయన ప్రశ్నించారు. తప్పు చేయకపోతే విచారణను స్వాగతించాలని ఆయన తెలిపారు. మొదటి దఫా ప్రభుత్వంలో హరీష్ రావు తప్పు చేస్తే కెసిఆర్ ఎందుకు చర్య తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ చుట్టూర దెయ్యాలు ఉన్నాయన్న కవిత ఇప్పుడు ఆ దెయ్యాలు హరీష్ రావు, సంతోష్‌లేనా? అనేది స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని అత్యున్నత న్యాయస్థానం సు ప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సమర్థిం చింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదివితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటుందనే షరతు సుప్రీంకోర్టు పెట్టింది. లోకల్ రిజర్వేషన్లపై తెలంగాణ ప్ర భుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా సుప్రీం కోర్టు కీల క తీర్పునిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ తరగతులతో పాటు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని కోర్టు స్పష్టంచేసింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం పై వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు (9,10, ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం) చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా, ఆ జీవోను కొట్టివేయగా, తాజాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలు వరించింది.

2వ పేజీ లో...

## సిబిఐ విచారణపై బిజెపి ఏంచేస్తుందో చూద్దాం

హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై సిబిఐ విచారణ జరిపించాల్సిందిగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖ రాయనున్నట్లు సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి 'ఇండి' అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ సు దర్శన్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం త న మంత్రివర్గ సహచరులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు పరిచయం చేశారు. సమావేశానంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సి బిఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాశారా? అని ప్రశ్నించగా, రాత్రి రెండింటి వరకూ అసెంబ్లీలో ఉన్నామని, సిబిఐకి లేఖ రాయడానికి సమయం ఎక్కడిదని ఆయన ఎదురు ప్రశ్నించారు. అయినా అది తమ అధికారులు చూసుకుంటారని అన్నారు. సిబిఐ విచారణ జ రిపేందుకు రాష్ట్రానికి రాకుండా గత బిఆర్ఎస్ ప్రభు త్వం నిషేధం విధించింది కదా?, దానిని ఎత్తివేస్తారా? అని ప్రశ్నించగా, నిషేధం అంటూ ఏమీ ఉండదన్నారు. అంశాల వారీగా లేఖ రాస్తే అందుకు కేంద్రం సమ్మతిస్తుందన్నారు. బిజెపిని ఫిక్స్ చేయడానికే సిబిఐ విచార ణ నిర్ణయం తీసుకున్నారా? అని ప్రశ్నించగా, అ దే లా? అని ఆయన ఎదురు ప్రశ్నించారు. సకాలంలో సి బిఐ విచారణ చేపట్టి చర్యలకు ఉపక్రమించకపోతే, బి జెపి, బిఆర్ఎస్ కలిసే ఉన్నాయన్న సంకేతాలు పంపేందుకేనా?, బాల్‌ను వాళ్ళ కోర్టులోకి నెట్టేసారా? అని ప్ర శ్నించినా, ఆయన 'వాళ్ళు' ఎవరూ? అంటూ



సమాధానం చెప్పకుండా దాట వేశారు. సిబిఐ విచారణ పూ ర్తి చేసేందుకు ఎంత గడువు కోరుతారని ప్రశ్నించగా, గడువు గురించి తాము ఎలా చెప్పగలమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ఆదివారం అసెంబ్లీలో రాత్రి బాగా పొద్దుపోయేంత వరకూ చర్చ జరగడం, సిబిఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించిన సం గతి తెలిసిందే. దీనిపై నేడో, రేపో గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనున్నట్టు సమాచారం.

## హరీశ్ వల్లే...
# కెసిఆర్ పై మరక



హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి): కాళేశ్వరం ప్రా జెక్ట్ నిర్మాణంలో జరిగిన అవినీతిలో హరీశ్‌రావుది కీలక పాత్ర అని మాజీ సిఎం కెసిఆర్ కు మార్తె, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం విషయంలో ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా...? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పు డు జరిగిన అవినీతి కారణంగా ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించారని గుర్తు చేశా రు.కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బా ధ్యుడిని చేస్తూ రేవంత్ ప్రభుత్వం తన తండ్రిపై సిబిఐ విచారణ వేసిందని, అందుకు తన కడుపు మండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్‌కు అవినీతి మరక ఎట్లా వచ్చిందో బిఆర్ఎస్ శ్రేణులు ఆలోచించాలని కోరారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో సోమవారం కల్వకుంట్ల కవిత మీడియా సమావేశం నిర్వహిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. అవినీతి అనకొండల మధ్య కెసిఆర్ బలిపశువు అవుతున్నారని మీడియాతో మాట్లాడుతూ ఎంఎల్‌సి కవిత కంటతడి పెట్టుకున్నారు. ఎవరి వల్ల, ఎందుకోసం కెసిఆర్‌కు అవినీతి మరక అంటిందో గుర్తించాలని సూచించారు. కెసిఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్ల ఆయనకు చెడ్డపేరు వచ్చిందని అన్నారు. తన మాటల వల్ల బిఆర్ఎస్ శ్రేణులకు కోపం రావొచ్చని తెలిపారు. అప్పుడప్పుడూ వాస్తవాలు మాట్లాడుకుని మందు తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు.

2వ పేజీ లో...

# బతుకమ్మ కార్నివాల్

**1వ పేజీ తరువాయి**

ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆట, పాటలతో జరుపుకునే గొప్ప పండుగ మన బతుకమ్మ అని, ఇది అత్యంత ప్రాచీనమైనదని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ఈ పండుగ పువ్వులనే కాదు, చెరువులను కూడా పూజించే పండుగ అన్నారు. ఈ బతుకమ్మ సందర్భంగా మన పెద్దలను కూడా పూజిస్తామన్నారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రకరకాల పూలను ఒక్కచోట అలంకరించి బతుకమ్మగా కొలవడం తెలంగాణ ప్రత్యేకత అని మంత్రి తెలిపారు. 9 రోజుల పాటు 9 వేడుకలను నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. బతుకమ్మ కూడా తెలంగాణ టూరిజానికి అలాంటి బ్రాండ్ ఐడెంటిటీ ఇస్తుందని మంత్రి తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో పర్యాటక రంగంలో రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించామని, దీనివల్ల కనీసం మూడు లక్షల మందికి అదనంగా ఉపాధి కల్పించవచ్చని ఆయన తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంలో దేశంలో తొలి ఐదుస్థానాల్లో తెలంగాణను నిలపడం రాష్ట్ర ఆదాయంలో 10 శాతం, అంతకంటే ఎక్కువగా టూరిజం నుంచి వచ్చేలా చూడటం ఈ లక్ష్యాల్లో భాగమని ఆయన తెలిపారు.

**సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వేడుకలు**

21వ తేదీన వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ ప్రారంభమవుతుంది. 22వ తేదీ నుంచి 24 వరకు, ప్రతి రోజు 3-4 జిల్లాల్లోని ముఖ్య ఆలయాలు, పర్యాటక, సాంస్కృతిక ప్రదేశాల్లో వేడుకలను నిర్వహిస్తారు. దీంతోపాటు ట్యాంక్ బండ్ వద్ద 27వ తేదీన -బతుకమ్మ కార్నివల్ ఈవెనింగ్, 28వ తేదీన ఎల్‌బి స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రయత్నం, 10,000ల కంటే ఎక్కువ మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు, 29వ తేదీన ఉత్తమ బతుకమ్మ పోటీ (పీపుల్స్ ప్లాజా వద్ద), 29వ తేదీన %-% ఐటీ రంగం ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఏల పోటీ, 30వ తేదీన -ట్యాంక్ బండ్ వద్ద గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్, ఫ్లోరల్ హోలి, 'బతుకమ్మ సైకిల్ రైడ్ (సెప్టెంబర్ 28వ తేదీ) 'మహిళల బైకర్స్ రైడ్ (సెప్టెంబర్ 29వ తేదీ) 'వింటేజ్ కార్ ర్యాలీ (సెప్టెంబర్ 30వ తేదీ), సెప్టెంబర్ 25వ తేదీ నుంచి 4 రోజుల పాటు మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ థీమ్‌తో ఆర్ట్ క్యాంప్, సరస్ బజార్ -పీపుల్స్ ప్లాజాలో మహిళల స్వయం సహాయక సంఘాలతో కార్యక్రమం, బతుకమ్మ ఆకారంలో అలంకరించిన ఫ్లోట్స్‌ను- హుస్సేన్ సాగర్‌లో విడుదల చేయనున్నారు.

**హైదరాబాద్ తో పాటు జిల్లాల్లో బతుకమ్మ వర్క్‌షాపులు**

'సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ వెల్‌కమ్ డ్యాన్స్, %-% ఢిల్లీ, ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చే అన్ని విమానాల్లో దీనిని ప్రదర్శిస్తారు. రాష్ట్రం బయట నుంచి వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక టూర్లు ఏర్పాటు చేస్తారు. జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా ఎయిర్ ఇండియా, ఇండిగో ఇన్-ఫ్లైట్ మ్యాగజైన్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని నిర్ణయం. ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లోని టూర్ ఆపరేటర్లు పాల్గొంటారు.

# మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

**1వ పేజీ తరువాయి**

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామని, ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొంది స్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారితో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమ కూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజే స్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి సంవత్సరంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 21,600 కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

హైటెక్ సిటీ పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లు ఏర్పాటు ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంతో పోటీ పడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారని, ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలి పారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడలు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, సెర్ప్ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# షాంఘైలో దౌత్య విజయం

**1వ పేజీ తరువాయి**

**తియాంజిన్ (చైనా) సెప్టెంబర్, 1:** పాకిస్థాన్ ప్రధాని సమక్షంలోనే షాంఘై సదస్సు వేదికపై భారతదేశానికి అత్యంత కీలకమైన దౌత్య విజయం దక్కింది. భా రత్‌లోని కశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ షాంఘై స హకార శిఖరాగ్ర సదస్సు (ఎస్‌సిఒ) సంయుక్త తీర్మానంలో స్పందన వె లువడింది. ఇతర అంతర్జాతీయ విషయాలతో పాటు ఈ ఉగ్రదాడిని ప్ర స్తావించిన షాంఘై సదస్సు విషయంలో భారతదేశానికి పూర్తి సంఘీభా వం, సంపూర్ణ సహకారం ఉంటుందని ప్రకటించింది. రెండు నెలల క్రితం క్వింగ్డావో షాంఘైసదస్సులో తమ పట్టు నెగ్గకపోవడంతో వాకౌట్ కు దిగిన భారత్ ఇప్పుడు తన పంతం నెగ్గించుకుంది. ట్రంప్ భారీ సుం కాల మోతల దశలో చైనా వేదికగా సాగిన షాంఘై భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. రష్యా, ఉక్రెయిన్, పాకిస్థాన్ నేతలు కూడా హాజరయిన ఈ సదస్సు సమీక్షల తరువాత సోమవారం సంయుక్త తీర్మాన ప్రకటన వెలువరించారు. ఎప్రిల్ 22వ తేదీన పహల్గామ్ ఉగ్రదాడిని సభ్యదేశాలన్ని ఖండిస్తున్నాయని తీర్మానంలో తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. ఇటువంటి ఉగ్రదాడులకు ప్రేరకులు పాత్రధారులు సూత్రధారులు ఎవరైనా సరైన శిక్షలకు వి చారణకు అర్హులు, వారికి తగు శిక్ష పడాల్సిందే అని తెలిపారు. ఉగ్రవాదం వేర్పాటువాదం, తీవ్రవాదం పట్ల ఎటువంటి ఉపేక్ష తగదు. ఏ దేశం కూడా ఉగ్రవాద స్థావరాలకు వేదికలు కారాదు. ఈ క్రమంలో ఎక్కడైనా ప్రయత్నాలు జరిగితే అటువంటి చర్యలను ఆయా దేశాల ప్రభుత్వాలు మొగ్గలోనే తుడిచిపెట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఉగ్రవాదానికి ఊతం ఇస్తోన్న దేశాలను కూడా ఉగ్రవాద దేశాలుగా ప్రకటించాల్సి ఉందనే భారత్ వాదనకు షాంఘై సదస్సు మద్దతు పలికింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఏ కోణంలో ఉన్నా అది గర్హనీయం అవుతుంది. ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ ప్రమాణాలు, సాకులు వెతకడం కుదరదు. కేవలం ఈ జటిల సమస్య పరిష్కారమే లక్ష్యంగా అంతర్జాతీయ సమాజం కలిసికట్టుగా సాగాల్సి ఉందని ఈ సదస్సు ద్వారా పిలుపు నిచ్చారు.

**వాకౌట్ నుంచి తీర్మానం వరకు..**

అంతకు ముందు రెండు నెలల క్రితం చైనాలోని క్వింగ్డావోలో జరిగిన షాంఘై సదస్సులో ఇటువంటి ప్రకటన లేకపోవడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాకౌట్ జరిపారు. ఇప్పుడు షాంఘై సదస్సు ద్వారానే భారత్ వాదనకు బలం చేకూరింది. షాంఘై వేదిక పై ప్రసంగించిన ప్రధాని మోడీ ఉగ్రవాదం అణచివేతలో శషభిషలు వద్దు, దాటివేతలు , ద్వంద్వ ప్రమాణాలు పనికి రావని తేల్చిచెప్పారు. మానవాళికి ముప్పు తెచ్చిపెట్టే ఉన్మాద చర్యలపై ఉపేక్ష ఎటువంటి పరిస్థితులకు దారితీస్తుంది? అనేక దేశాలు ఉగ్రవాద చర్యలతో తల్లడిల్లాయి. ఇప్పటికీ ఉగ్రవాద నిర్మూలన కొలిక్కి రాలేదు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేలవ హాజరీ, చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్ ఇతర దేశాల అధినేతలతో జరిగిన వార్షిక సదస్సులో ప్రధాని మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరు , కలిసికట్టు పోరు మానవీయ కోణంలో జరిపే విద్యుక్త ధర్మం అన్నారు. పాకిస్థాన్‌కు, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోన్న ఇతరులకు ప్రధాని మోడీ ఈ వేదిక నుంచి నిర్దిష్ట హెచ్చరికలు వెలువరించారు. ఉగ్రవాదానికి సొంత ప్రయోజనాల కోసం మద్దతు నిచ్చే కొన్ని దేశాలు మనకు ఆమోదయోగ్యమా? వాటిని ఆరాధ్యప్రదంగా చూసుకుందామా? అని నిలదీశారు. ఉగ్రవాదంపై వేర్వేరు స్పందనలు, ద్వంద్వ ప్రమాణాలతో మరింత నష్టం జరుగుతుందని తేల్చిచెప్పారు. జట్టుగా నిలిస్తేనే ఉగ్రవాదం ఆటకట్టు అవుతుందన్నారు. ఉగ్రవాదాన్ని భారత్ తిప్పికొడుతుంది. ఈ క్రమంలోనే భారత్ మే 10వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించింది. ఇతర దేశంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిందని గుర్తు చేశారు. ఇక్కడ మిత్రదేశాల కలయికతో సాగే ఎస్‌సిఒ అంటే సెక్యూరిటీ, కనెక్టివిటీ ఆపర్చునిటీ అని భద్రతా అనుసంధాన సమాన అవకాశాల వేదిక ఇది కావాలని పిలుపు ఇచ్చారు. ఎస్‌సిఒ మరింత కీలక శక్తి కావల్సి ఉంది. ఇక్కడ నుంచి ప్రాంతీయ సహకారానికి, ప్రపంచ శాంతి సుస్థిరత భద్రతలకు సరైన పిలుపు వెలువడాల్సి ఉందన్నారు. ఎస్‌సిఒ నుంచి నాగరికతల పరిరక్షణ వేదిక కూడా ఏర్పాటు కావల్సి ఉందని పిలుపు నిచ్చారు. పలు ప్రాంతాల వారి నాగరికతలు, విశిష్టతల పరిరక్షకు కళలు సాంస్కృతిక పరస్పర పరిచయానికి పరిరక్షణకు వీలు అవుతుందన్నారు.

**చైనా రోడ్డు నిర్మాణంపై అసంతృప్తి...**

చైనాలోనే జరిగిన ఈ వేదిక ద్వారా ప్రధాని మోడీ చైనా ప్రతిపాదిత బెల్ట్ రోడ్ ఇన్నియేటివ్ (బ్రి) పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఇతర దేశాల సార్వభౌమాధికారం, సమగ్రత, ప్రాదేశికతకు సవాలు విసిరే నిర్మాణాల పరస్పరం విశ్వాసం కోల్పోయే స్థితిక తీసుకువస్తాయని హెచ్చరించారు. ఈ దశలో ఆయన పాక్, చైనాలను కలిపి విమర్శించారు. ప్రధాని మోడీ తమ ప్రసంగంలో భారతదేశ ప్రగతి ప్రస్థానం వివరించారు. రిఫార్మ్ పర్‌ఫాం, ట్రాన్స్‌ఫామ్ ( ఆర్‌పిటితో కదులుతున్నామని, దీనిని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియచేస్తానని వివరించారు. సవాళ్లను అవకాశాలుగా మల్చుకోవడం ముందుకు సాగడం భారత్ లక్షం అన్నారు.

## రేవంత్‌ను కరెన్సీ మేనేజర్ అన్న కెటిఆర్.. రాహుల్‌కు సూటి ప్రశ్న..

**హైదరాబాద్, సెప్టెంబర్, 1 (సూర్యసేన ప్రతినిధి):** కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈ కేసును సిబిఐకి అప్పగిస్తామని అన్నారు. అయితే ఈ విషయంపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ మండిపడ్డారు . 'ఎక్స్' వేదికగా ఆయన సిఎం రవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటర్లు వేశారు. "తెలంగాణలో కరెన్సీ మేనేజర్(సిఎం) కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తారట. గతంలో రాహుల్ గాంధీ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలను అంతం చేసే సెల్స్ అని అన్నారు. మిస్టర్ గాంధీ మీకు తెలుసా.. మీ సిఎం ఏం చేస్తున్నారో..? ఇలా ఎంత బెదిరించినా.. భయపడేది లేదని.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజలపై, న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది" అని కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో పాటు గతంలో రాహుల్ చేసిన పోస్ట్‌కి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఆయన జత చేశారు.

# ఎంపిలు విజ్ఞులు ఆలోచించే ఓటేస్తారు

**1వ పేజీ తరువాయి**

అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప రిచయం చేసేందుకు పిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సో మవారం ఒక హోటల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, కాం గ్రెస్ ఎంపిలు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, సి పిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పాల్గొన్నారు. మజ్లీస్ నుంచి ఎవరూ హాజరుకాలేదు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ తనపై విమర్శలు చేస్తే పోటీ నుంచి తప్పుకుంటానని కొందరు అనుకుంటున్నారని, అయితే తాను వెనక్కి తగ్గేదేలే అని ఆయన తెలిపారు. తనను విమర్శించే వారు సల్వాజుడుంపై తాను ఇచ్చిన తీర్పును చదవాలని ఆయన సూచించారు. తాను ఇచ్చిన తీర్పును 11 మంది న్యాయవాదులు చదివి ఒక్క వాక్యం కూడా మార్చలేదని అన్నారు. కోర్టు తీర్పుల గురించి మాట్లాడే వారు ముందుగా అది చదవాలని ఆయన తెలిపారు.

**నేను ప్రతిపక్ష అభ్యర్థిని..**

తాను 'ఇండి' కూటమి అభ్యర్థిని కాదని, ప్రతిపక్షాల అభ్యర్థినని ఆయన తెలిపారు. తాను ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలు మాసకబారుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ మాట్లాడాల్సిన అవశ్యకతం ఉందన్నారు. తాను ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నానని ఆయన తెలిపారు. పౌరహక్కులు, సామాజిక న్యాయం, ఆదేశిక సూత్రాల గురించి మాట్లాడుతానని అన్నారు. రాజకీయ ముళ్ళ కిరీటం ఎందుకని కొందరు అడుగుతున్నారని, వారందరికీ ఇదే నా సమాధానం అని ఆయన రాజ్యాంగాన్ని చూపించారు. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయమైంది కాదని అన్నారు. లోగడ తాను ఐదు సార్లు రాజ్యాంగంపై ప్రమాణం చేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. రాజ్యాంగానికి లోబడి ఉండడమే కాదు, దానిని కాపాడడం కూడా తన బాధ్యత అని అన్నారు. ఓటు వేసే ప్రతి పౌరుడు పరోక్షంగానో రాజకీయ అభిప్రాయాన్ని కలిగి ఉంటారని ఆయన తెలిపారు. దేశ ప్రజలు ముందు ఓటర్లు, తర్వాతనే పౌరులని ఆయన అన్నారు. ఓటర్ల జాబితా చిత్తు కాగితం కాదని ఆయన తెలిపారు. తమకు ఇష్టం ఉన్న వారి పేర్లు రాస్తాం, ఇష్టం లేని వారి పేర్లు రాయమంటే కుదరదని అన్నారు.

**మెజారిటీ ఉందని చట్టం చేస్తే..?**

మెజారిటీ ఉంది కదా అని ఏది పడితే అది చట్టం చేయలేమని అన్నారు. ఉదాహరణకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రేపటి నుంచి ప్రతిపక్షాల నేతలందరూ తల కిందకు చేసి కాళ్ళు పైకెత్తి నడవాలని చట్టం చేయలేవని అన్నారు. ఏదైనా రాజ్యాంగ సూత్రాలకు లోబడి ఉంటాయని ఆయన వివరించారు. రాజ్యాంగం మసకబారిపోతున్నదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తాను రాజ్యాంగ పరిరక్షకునిగా ఉంటానని ఆయన తెలిపారు. అందుకే ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు అంగీకరించానని ఆయన చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను మాట్లాడే విధానంలో మార్పు కనిపిస్తున్నదని ఢిల్లీలో ఓ విలేకరి తనను ప్రశ్నించగా, 'నేను ముదిరిపోయాను..' అని సమాధానమిచ్చానని ఆయన చెప్పగానే ముఖ్యమంత్రితో సహా అందరూ పెద్దగా నవ్వారు.

**బలబలాలను లెక్కించ లేదు..**

ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తీర్పు చెప్పేందుకు అవకాశం ఉంటుంది కదా? అలాగే ఇరు పక్షాల బలబలాలు తెలుసుకున్నాకే ఎన్నికల బరిలోకి దిగారా? అని ప్రశ్నించగా, తాను బలబలాలను లెక్కించలేదన్నారు. విజ్ఞులైన ఎంపిలు అన్నీ ఆలోచించే ఓట్లు వేస్తారని ఆయన సమాధానమిచ్చారు. ఏదైతేనేం చూద్దాం అని ఒక అడుగు ముందుకేశానని అన్నారు. ఎన్డీయే అభ్యర్థి బిసి అని, మీరు ఓసి అనే విమర్శ ఉంది కదా? అని ప్రశ్నించగా, కులంతో సంబంధం లేదన్నారు. నక్సల్స్ బాధిత కుటుంబ సభ్యులు మీకు ఓటు వేయవద్దని పిలుపు ఇచ్చారని ప్రశ్నించగా, వారికి మాట్లాడే హక్కు రాజ్యాంగం కల్పించిందని ఆయన చెప్పారు. ఎన్నికల సందర్భంగా డబ్బుల పంపిణీ గురించి ప్రశ్నించగా, ఇప్పుడు ఉప రాష్ట్రపతి ఎన్నిక గురించే అడగాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

**ఎన్డీయే కూటమికి ఛాలెంజ్ : సిఎం రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఎన్డీయే కూటమికి బలమైన ఛాలెంజ్ విసిరామని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 42 లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులు ఆత్మప్రభోదానుసారంగా ఓటు వేయాలని ఆయన కోరారు. గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి తదితరులు జాతీయ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారని, ఇప్పుడు తెలుగు బిడ్డ పోటీ చేస్తున్నందున తెలుగువారందరూ సహకరించాలని ఆయన కోరారు. 'ఇండి' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి గురించి కేంద్ర హోం శాఖ మంత్రి, ఇతర బిజెపి నాయకులు మాట్లాడుతున్నారని ఆయన చెబుతూ నక్సలిజం అనేది ఒక ఫిలాసఫీ, విధానమని అన్నారు. కొంత మందికి నచ్చవచ్చు, కొంత మందికి నచ్చకపోవచ్చు అని ఆయన తెలిపారు. అంత మాత్రాన అంతం చేస్తామంటే ఎలా? అని ఆయన ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి పెళ్ళి కొడుకు సిపిఐ నేత డాక్టర్ కె. నారాయణ ప్రసంగిస్తూ ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పుడు పెళ్ళి కొడుకు అని సంభోదించడంతో అందరూ నవ్వారు. అందాల రాముడు, న్యాయకోవిదుడైన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపించారని అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని నక్సలైట్ అని కొంత మంది వ్యాఖ్యానించడం సంతోషమేనని అన్నారు. ఆపరేషన్ కగార్‌లో పెట్టి ఏమైనా చేస్తారేమోనన్న భయం ఉందని, అయితే ప్రజాస్వామ్యం బలంగా ఉందని ఆయన తెలిపారు. ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపొందితే రాజ్యాంగానికి మేలు జరుగుతుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ఇండి కూటమిలో లేని పార్టీలూ మద్దతునిస్తున్నాయని తెలిపారు. ఎంపిలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి లేఖ విడుదల చేసిన సిఎం రేవంత్ రెడ్డి ఇదిలాఉండగా అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపిలందరికీ లేఖ రాశారు. ఈ లేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు.

# నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

**1వ పేజీ తరువాయి**

ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని తమకు ఉందని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనలు వినిపించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు తమ పిల్లలు వేరే రాష్ట్రంలో (ఏపిలో) చదవాల్సి వచ్చిందని, కావున వారిని కూడా స్థానికులుగా పరిగణించాలని మెడికల్ కోర్స్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్య ర్థుల తరపున పిటిషనర్లు వాదనలు వినిపించారు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలపై జస్టిస్ గవాయ్ పలు ప్రశ్నలు వేసారు. రాష్ట్రంలో పుట్టిన, పదో తరగతి వరకు చదివిన, తల్లిదండ్రు లు ఇక్కడే శాశ్వత నివాసం ఉన్న విద్యార్థి వేరే రాష్ట్రాల్లో ఇంటర్ చదివారన్న కారణంతో వారి ప్రవేశాలను నిరాకరించవచ్చా? జెఇఇ, నీట్ శిక్షణ నిమిత్తం రాజస్థాన్‌లోని కోటాకు దేశం నలుమూలల నుంచీ విద్యార్థులు వెళ్తుంటారు కదా? అలా వెళ్లిన వారి పరిస్థితి ఏంటి? న్యాయమూర్తి ప్రశ్నించారు.

ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఎఎస్ అధికారి డిప్యుటేషన్‌పై ఢిల్లీ వెళ్తే, అప్పుడు ఆయన కుమారుడు దిల్లీలో ఇంటర్ చదివాడని పక్కన పెడతారా? స్థానికత నిబంధన గురించి తెలియని విద్యార్థులు వేరే రాష్ట్రంలో చదువుకోవడానికి వెళితే అక్కడా, ఇక్కడా స్థానికులు కాకుండా పోయే ప్రమాదం ఉంది కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని దాంతో వారి పిల్లల కు ఈ జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. రాష్ట్రప్రభుత్వ వాదనతో ఏకీభవించిన సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే గత ఏడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఇక నుంచి ఎంబిబిఎస్, బిడిఎస్ యూజి కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలు కానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇవ్వడం పట్ల ప్రైవేటు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా తప్పని పరిస్థితు ల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని కోరుతున్నారు.

**సుప్రీం' తీర్పుపై నీట్ పేరెంట్స్ అసోసియేషన్ హర్షం**

మెడికల్ అడ్మిషన్లో స్థానికత అన్న అంశంపై ఎట్టకేలకు నీట్ అభ్యర్థుల పేరెంట్స్ అసోసియేషన్ విజయం సాధించింది. మెడికల్ అడ్మిషన్లో స్థానికత కోసం తీసుకు వచ్చిన జీఓ 33ని తప్పకుండా అమలు చేయాలని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ఇటీవల సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు విశ్వనాథుల రమేష్ , ఏ పద్మాచారి ద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టుకు తమ వాదనను లిఖితపూర్వకంగా అందజేసారు. ఈ క్రమంలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదవాల్సిందేనని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించడం పట్ల నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయ ణ చారి, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ తమ పరపున వాదనలు వినిపించిన న్యాయవాదులు విశ్వనాథుల రమేష్, పద్మాచారికి అభినందనలు తెలి పారు.

# హరీశ్ వల్లే కెసిఆర్ పై మరక

**1వ పేజీ తరువాయి**

మాజీ ఎంపి సంతోష్ కుమార్, మాజీ మంత్రి హరీష్‌రావు, మేఘా కృష్ణారెడ్డి వల్లనే కెసిఆర్‌కు చెడ్డపేరు వచ్చిందని ఆరోపించారు. కెసిఆర్ జనం కోసం పనిచేస్తే వాళ్లు సొంత ఆస్తులు పెంపు కోసం పని చేశారని మండిపడ్డారు. హరీష్‌రావు, సంతోష్ తనపై ఎన్నో సార్లు కుట్రలు చేశారని, తనపై ఎన్ని కుట్రలు చేసినా ఏం మాట్లాడినా నోరు మెదపలేదని అన్నారు. కానీ, ఇప్పుడు కెసిఆర్ బిడ్డగా ఎంతో బాధపడుతున్నట్లు తెలిపారు. హరీష్‌రావు, సంతోష్ వెనుక సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని కవిత ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, హరీష్‌రావు, సంతోష్ మధ్య లోపాయకారి ఒప్పందం ఉందని విమర్శించారు. హరీష్‌రావు, సంతోష్‌ను రేవంత్ ఏమీ అనరు అని, తన తండ్రిపైనే బాణం వేస్తారని అన్నారు. కెసిఆర్ మీద సిబిఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటీ..? లేకపోతే ఏంటీ..కెసిఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి.. పోతే ఏంటీ..అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ వయసులో కెసిఆర్ సిబిఐ విచారణ ఎందుకు ఎదుర్కోవాలా..? అని ప్రశ్నించారు. కెసిఆర్ రాజకీయాల్లో ఇన్నేళ్లు ఉన్నా ఆస్తులు సంపాదించుకోలేదని, డబ్బులపై కెసిఆర్‌కు ఏనాడు ఆశ లేదని పేర్కొన్నారు. తన తండ్రికి డబ్బు, తిండిపై ఏనాడూ యావ లేదు అని, తన తండ్రి పరువు పోతే తమకు బాధ ఉంటుందని కానీ, వాళ్లకు ఎందుకు ఉంటుందని అన్నారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిందని పేర్కొన్నారు. తన లేఖ బయటకు వచ్చినా తాను ఎవరి పేర్లు బయటపెట్టలేదని స్పష్టం చేశారు.

**ఇంజినీర్ల వెనుక ఎవరున్నారో ఎందుకు విచారణ చేయట్లేదు...?**

కాళేశ్వరంలో పనిచేసిన ముగ్గురు ఇంజినీర్ల వద్ద వందల కోట్ల సంపద ఉందని ఎంఎల్‌సి కవిత అన్నారు. కాళేశ్వరం ఇంజినీర్ల ఆస్తులపై ఎందుకు విచారణ జరిపించట్లేదని, ఎసిబికి చిక్కిన ఇంజినీర్ల వెనుక ఎవరున్నారో ఎందుకు విచారణ చేయట్లేదని నిలదీశారు. బిఆర్‌ఎస్‌ను ఇబ్బందులకు గురిచేసిన అవినీతి అనకొండలను ఉపేక్షించొద్దని కోరారు. హరీష్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్ రేపట్నుంచి తనపై దుష్ప్రచారం చేస్తారని, సోషల్ మీడియాలో తనపై నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కెసిఆర్ అంటే మహానాయకుడు అని దేశవ్యాప్త పేరు ఉందని, రేపట్నుంచి కెసిఆర్ పేరు చెబితే సిబిఐ పేరు కూడా వినిపిస్తుందని అన్నారు. పెద్దసార్ వద్దకు వచ్చాక కాంప్రమైజ్ అయ్యే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. తనని రేవంత్‌రెడ్డి, బిజెపి, బండి సంజయ్ నడిపిస్తున్నారని రేపట్నుంచి అంటారని జోస్యం చెప్పారు. తనది కెసిఆర్ బ్లడ్ అని, తాను స్వతంత్రంగా ఉంటానని చెప్పారు. ఒకరు నడిపిస్తే నడిచే వ్యక్తిని కాదని వెల్లడించారు. కాళేశ్వరంలో చిన్న భాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్టు చేస్తున్నారని కవిత మండిపడ్డారు.

# గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**







**సూర్యాపేట లోని సాయి నగర్ లో గల వాసవి ఎన్ క్లేవ్ అపార్ట్ మెంట్ లో గణేష్ నవరాత్రుల సందర్భంగా శివలింగాకృతిలో దీపోత్సవం...**

సూర్యాపేట అగ్రికల్చర్, సెప్టెంబర్ 01 (సూర్య సేన): గణేష్ ని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాడుగుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ గణేష్ ని ఆశీస్సులతో రైతులు సుఖశాంతులతో ఉండాలని కోరారు. అదేవిధంగా రైతులకు మంచి పాడిపంటలు పండి మంచి ధర రావాలని, రైతులు సుఖశాంతులతో ఉండాలని కోరారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేకుండా ప్రజలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. సకాలంలో వర్షాలు పడడంతో రైతుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని అన్నారు. రైతులు, వ్యాపారుల సహకారంతో మార్కెట్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.

# ఇన్సూరెన్స్ చెక్ అందజేసిన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్

**- పోలీస్ సాలరీ ప్యాకేజీ ఎస్బిఐ బ్యాంక్ అంకౌంట్ ఇన్సూరెన్స్ ద్వారా 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్**




సూర్యాపేట / కోదాడ, సెప్టెంబర్ 01 (సూర్య సేన): కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో అకాలంగ మరణించిన కానిస్టేబుల్ రాంబాబు కుటుంబానికి 10 లక్షల రూపాయల సాలరీ ప్యాకేజ్ ఎస్బిఐ ఇన్స్యూరెన్స్ చెక్ ను సోమవారం జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ తన కార్యాలయంలో అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసులకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ ఇవ్వడం జరిగినది. పోలీసు సిబ్బంది మరణించిన క్రమంలో ఈ పోలీస్ సాలరీ ప్యాకేజ్ అకౌంట్ ద్వారా 10 లక్షల రూపాయల ఇన్స్యూరెన్స్ అందిస్తుంది. ఈ స్కీం ద్వారా రామాబాబు కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల చెక్కు అందజేయడం జరిగినదని, ఈ స్కీం పోలీసు కుటుంబాలకు ఎంతగానో ఆర్థిక బాసటగా నిలుస్తుందని ఎస్పి అన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉండాలి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ స్కీం ను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఏవో మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యాపేట రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, సిబ్బంది ఉ

# వినాయక నిమజ్జన ప్రాంతం మినీ ట్యాంక్ బండ్ ను పరిశీలించిన అధికారులు

సూర్యాపేట, సెప్టెంబర్ 01 (సూర్య సేన): ఈనెల 5 వతారీకు శుక్రవారం రోజున పట్టణంలో నిమజ్జనం జరుగు సద్దుల చెరువు ప్రాంతాన్ని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావు,డీఎస్పీ ప్రసన్న కుమార్,మున్సిపల్ కమీషనర్ సిఏచ్.హన్మంత రెడ్డి,యం.ఆర్.ఓ.కృష్ణయ్య తమ సిబ్బందితో కలసి సందర్శించి నిమజ్జనం కొరకు ఏర్పాటు చేయు క్రేన్ పెట్టె ప్రాంతాలను,భారీ కేడింగ్ ,లైటింగ్ ఏర్పాటు ప్రాంతాలను సందర్శించారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈనెల 5వ తారీకున ఉత్సవ కమిటీ ల వారు నిమ్మజ్జనము చేయాలిని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట టౌన్ సిఐ వెంకటయ్య,రూరల్ సిఐ రాజశేఖర్ రూరల్ ఎస్ ఐ బాలు నాయక్ ,మున్సిపల్ డి.ఇ సత్యారావు,టిపిఒ సోమయ్య ,ఏ ఇ తిరుమలయ్య ,ఆర్.ఐ.శ్రీధర్,మున్సిపల్ సిబ్బందిఎస్.ఎస్.ఆర్.ప్రసాద్ ,యాదగిరి, సమ్మి ,రంజిత్ ,వేణు పాల్గొన్నారు.



# ప్రజావాణిలోని పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి





సూర్యాపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 01 (సూర్య సేన): పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరెట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని, అలాంటి శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం భూములకు సంబంధించి 41 ఫిర్యాదులు, ఎంపీడీవోలకు 13,మున్సిపల్ కమిషనర్లకి 8, ఇతర అధికారులకు 14 ఫిర్యాదులు ,మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయి .వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డి ఆర్ డి ఓ పిడి వివి అప్పారావు, డిపి ఓ యాదగిరి, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డి సీ ఓ పద్మ, డి ఈ ఓ అశోక్, డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్, డి ఎస్ ఓ మోహన్ బాబు,ఈ డి ఎస్ సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి,పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్టెండెంట్లు సాయి గౌడ్,సంతోష్ కిరణ్, శ్రీనివాసరాజ్, శ్రీలత రెడ్డి,అధికారులు, సిబ్బంది తదితరులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఘనంగా గండూరి ప్రీతమ్ జోన ఐదవ వర్ధంతి వేడుకలు



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 01 (సూర్య సేన): మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ ప్రథమ కుమారుడు, గండూరి ప్రీతమ్ జోన ఐదవ వర్ధంతి వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా, వారి జ్ఞాపకార్థంగా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి నాగరాజు, మోత్కూరి సందీప్ ఆధ్వర్యంలో, మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసనసభ్యులు గుంట కండ్ల జగదీశ్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి వారి చేతుల మీదుగా స్థానిక బొడ్రాయి బజారులో గల ప్రభుత్వ గండూరి జానకమ్మ మెమోరియల్ (జిజేఎం) స్కూల్ లో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, స్టాఫ్, మరియు రాచకొండ కృష్ణ , ఎల్గూరి రామ్మూర్తి, షాబుద్దీన్ అరవింద్, ఉపేందర్,సాయి, రాజేష్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

**ప్రీతమ్ జోన ఐదవ వర్ధంతి సందర్భంగా అన్నదానం**

మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ ప్రథమ కుమారుడు, గండూరి ప్రీతమ్ జోన ఐదవ వర్ధంతి సందర్భంగా, వారి జ్ఞాపకార్థంగా కొత్త బస్టాండ్ వద్ద ఫ్లేవర్ కింద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఇటి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బైరు వెంకన్న గౌడ్, టైసన్ శీను కెక్కిరేణి నాగయ్య, పల్స వెంకన్న ఎలుగూరి రామ్మూర్తి, వల్దాస్ జే తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి అంబేద్కర్ కాలనీ జలమయం





మంగపేట, సెప్టెంబర్ 01 (సూర్య సేన): మంగపేట మండలంలోని రమణక్కపేట గ్రామం లో అంబేద్కర్ కాలనీలో శనివారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపిలేని భారీ వర్షానికి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏటూరునాగారం-భూర్గంపాడు ప్రధాన రహదారి పై మోకాళ్లోతులో వరద పారగా రమణక్కపేట అంబేద్కర్ కాలనీలోకి సమీపంలోని గుట్ట నుండి భారీగా వచ్చిన వరద ప్రవాహం కాలనీలోని ఇళ్లను ముంచెత్తింది. ఆదివారం అర్ధరాత్రి నుండి భారీ వర్షం పడగా పలు ఇళ్లలోకి వరద చేరడంతో అర్ధరాత్రి కావడంతో ఇళ్ల నుంచి బయటకుపోలేని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలోని విలువైన వస్తువులు, ఫ్రిజ్జు కూలర్ వంట సామాగ్రి తడిసి ముద్దయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా కొంత మంది ఇళ్లలోని వస్తువులు వరదనీటిలో మునిగిపోయాయి. వరద ప్రభావానికి కొట్టుకుపోవడం జరిగి ఆవేదన వ్యక్తం చేశారు అధికారుల అప్రమతమై గుట్ట నుండి వచ్చే వరదను కాలువలోకి మళ్లించి వరద నీరు మా కాలనీ పై మా ఇండ్లపై పడకుండా ఇండ్లలో వరద వల్ల పోయినటువంటి విలువైన సామాగ్రి ఇప్పించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## సంపాదకీయం

మంగళవారం, సెప్టెంబర్ 2, 2025

### రుతుపవనాల విధ్వంసం

# ఆపలేమా?

ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఆగస్టులో మేఘ విస్ఫోటంతోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఉపశమనం అనేది కేవలం ప్రతిచర్యాత్మక చర్యలకే పరిమితం కాకూడదు. కేంద్రీకృత జ్ఞానం అవసరం. విధ్వంసకర వర్షపాతం ఇప్పుడుపునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణ వ్యూహాల కోసం అధికంగా ఖర్చు చేయడం తప్పనిసరి. అటువంటి చర్యలను అమలు చేయలేని అత్యవసర పరిస్థితులుగా పరిగణించే వైఖరిని కొనసాగించడమంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న ఆధారాలను తిరస్కరించడమే అవుతుంది. గత ప్రకృతి వైపరీత్యాల అనుభవాల నుంచి నేర్చుకున్నప్పటికీ వాటిని విస్మరించి ప్రతి విపత్తును అసాధారణమైనదిగా పరిగణించడం పరిపాటవుతోంది. కొండచరియలు విరిగి పడడానికి 51% అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. పర్యావరణ సున్నిత ప్రాంతాలపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనులు కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో 2015 నుంచి 2018 మధ్యకాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. ఆ లోటు భర్తీ ఇప్పటికీ కాలేదు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు వదులవుతున్నాయి. దీంతోపాటు పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేమని ఎన్ని హెచ్చరికలు పర్యావరణ శాస్త్రవేత్తలు చేసినా అటవీ నిర్మూలన, రోడ్ల వెడల్పు నిర్మాణాలు చేపట్టడం జరుగుతోంది. కొండవాలు ప్రాంతాలను బలహీనం చేస్తున్నారు. దీంతో పరీవాహక సామర్థం కుదించుకుపోయి ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నా ముందస్తు హెచ్చరికలు, పల్లపు ప్రాంతాలను ఖాళీ చేయించడం వంటి వ్యవస్థలు ఇంకా సరిగ్గా అభివృద్ధి చెందలేదు. ఈ హెచ్చరికలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సరిగ్గా అందడం లేదు. నష్టం సంభవించినప్పుడు రిలీఫ్ ఏజెన్సీలు స్పందిస్తుంటాయి. కానీ ఒక క్రమపద్ధతిలో చర్యలు చేపట్టడం కానీ, ముందుగా అవసరమైన సరఫరాలు సిద్ధం చేయడం కానీ, సామాజక పరంగా సన్నాహాలు కానీ లోపభూయిష్టంగా ఉంటున్నాయి. వాతావరణాన్ని తట్టుకునే మౌలిక సదుపాయాల గురించి ఆలోచించకుండా రాష్ట్రాలు, కేంద్రం అత్యవసరంగా రోడ్డు నిర్మాణాలను, నగరాల విస్తీకరణాన్ని చేపడుతున్నాయి. ఇతర అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. మళ్లీ ఆ లోటు భర్తీగా కొత్తగా అడవుల పెంపకాన్ని చేపట్టడం లేదు. పునరావాస చర్యలు కొద్దిగా ఉంటున్నాయి. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీటన్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. సుస్థిర సౌకర్యాలు సమకూర్చనిదే పునరావాస చర్యలు ఎంత చేపట్టినా, బడ్జెట్ నిధులు ఎంత ఖర్చు చేసినా ఈ సమస్యల పరిష్కారం కాదు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని నివారించగలగాలి. ముందస్తు హెచ్చరికలు తక్షణం ప్రజలకు అందేలా చూడాలి. వచ్చే రుతుపవనాలు కూడా ఇలాంటి విధ్వంసాలనే కలిగించవచ్చు. పునరావాస చర్యలు కల్పించామని సంతృప్తి పడరాదు.


సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


# తీర్పులపై వక్రభాష్యాలు.. ఇదేం తీరు?



సల్వాజుడుం అంటే గోండు భాషలో శాంతియాత్ర అని అర్థం. ఇంగ్లీషులో పీస్ మార్చ్.. అంటే శాంతి సాధన కోసం జరిపే కవాతు అనుకోవాలి. గిరిజన తెగలు మాట్లాడుకునే స్థానిక భాషల్లో ఒకటైన గోండులో ఇది సల్వాజుడుం అని అర్థం కానీ చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని రమణసింగ్ ప్రభుత్వం మాత్రం దీన్ని ఆ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలైన బస్తర్, దంతేవాడ వంటి చోట్ల శాంతిసాధన కోసం ప్రయోగించలేదు. అక్కడ బలంగా ఉన్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడానికి ఆనాటి చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక ప్రైవేట్ ఆర్మీ సల్వాజుడుం. 2005 నుంచి 2011 దాకా దాదాపు ఆరు సంవత్సరాలు ఈ సల్వాజుడుం చేసిన ఘనకార్యం ఏమిటంటే ఆ ప్రాంతాల్లో మారణకాండకు కారకులు కావడం, అక్కడ నివసిస్తున్న గిరిజనుల మీదకు గిరిజనులనే పురిగొల్పడం కోసం ఏర్పడిన ఒక రాజ్యాంగేతర, చట్ట వ్యతిరేక వ్యవస్థ. సల్వాజుడుం ఏర్పడిన తర్వాత దానిని సుప్రీంకోర్టు రద్దు చేసేవరకు ఆ ప్రాంతంలో జరిగిన మారణకాండలో 1019 మంది గ్రామస్థులు, 42 మంది మావోయిస్టులు, 726 మంది భద్రతా బలగాలకు సంబంధించినవారు హతమయ్యారని, దాదాపు 55 వేల మంది గిరిజనులు పొరుగున ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వలసపోయారని అధికారిక లెక్కలే చెపుతున్నాయి. నందిని సుందర్ అనే ఒక మహిళా యాక్టివిస్ట్ వేసిన కేసులో జులై 5, 2011న సుప్రీం కోర్టు సల్వాజుడుంను వెంటనే రద్దు చెయ్యాలని తీర్పు ఇవ్వకపోయి ఉంటే ఇంకెంత మారణహోమం జరిగి ఉండేదో. అటు ఇటు ఇంకా ఎన్ని వందల, వేల గిరిజనుల ప్రాణాలు పోయి ఉండేవో చెప్పనవసరం లేదు. ఈ తీర్పు వెలువరించిన ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్ఎస్ నిజ్జర్. ఈ ఇరువురూ తమ తీర్పులో సల్వాజుడుమనేది ఒక చట్ట వ్యతిరేక రాజ్యాంగ వ్యవస్థ కాబట్టి దాన్ని మూసివేయాల్సిందేనని తీర్పునిచ్చారు. అంతేకాదు, సల్వాజుడుం దగ్గర ఉన్న మారణాయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర పరికరాలన్నీ స్వాధీనం చేసుకోవాలని అప్పటి చత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. సల్వాజుడుం వల్ల జరిగాయని ఆరోపణలు ఉన్న నేరాలన్నిటిమీద దర్యాప్తు కూడా జరపాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇరువురూ తీర్పు చెప్పారు. సల్వాజుడుంలో చేరినవారందరికీ ప్రత్యేక పోలీస్ అధికారి హోదా కల్పించారు. వారి విద్యార్హత ఐదవ తరగతి వరకు మాత్రమే. ఈ తీర్పు వెలువరించిన న్యాయమూర్తుల్లో ఒకరైన సుదర్శన్ రెడ్డి మరో తీర్పు కూడా ఇచ్చారు. మావోయిస్టు ఉద్యమం ప్రబలంగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలలో శిబిరాలు ఏర్పాటు చేసుకుని ఉన్న ప్రత్యేక పోలీసు దళాలను వెంటనే ఖాళీ చేయించాలని. మావోయిస్టుల అణచివేత పేరిట పాఠశాలలు, కళాశాలలు ఆక్రమించుకోవడం కుదరదని స్పష్టంగా తీర్పు చెప్పింది. సల్వాజుడుం వంటి సంస్థలు అప్పట్లో చత్తీస్ గఢ్ ప్రజలకు కొత్తేమో కానీ మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగిన రోజుల్లో తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ వంటి ప్రాంతాల ప్రజలకు మరో రూపంలో ఎంతో అనుభవంలో ఉన్నదే. ఒక ఉదాహరణ చెప్పుకోవాలంటే 1986 ప్రాంతాల్లో అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం బలంగా ఉన్న కరీంనగర్‌లో పోలీసు సూపరింటెండెంట్ స్వయంగా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన అన్నెబోయిన మల్లయ్య అనే వ్యక్తి నాయకత్వంలో కొంతమంది ముఖాలకు ముసుగేసి తన క్యాంపు కార్యాలయంలోనే 'ఫియర్ వికాస్' అనే సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటింపజేశారు. నక్సలైట్లను ఎదుర్కోవడానికి, కట్టడి చేయడానికి, హతమార్చడానికి ఉద్దేశించి తాము ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పత్రిక సమావేశంలో మల్లయ్య చెప్పారు. ఇలా పోలీసుల ప్రోత్సాహంతో మరికొన్ని ఇటువంటి సంస్థలు పుట్టుకొచ్చాయి. 'గ్రీన్ టైగర్స్' వంటిది వాటిలో బాగా ప్రచారంలోకి వచ్చిన సంస్థ. కొంతమంది ప్రభుత్వానికి లొంగిపోయిన మాజీ తీవ్రవాదులను కూడా ప్రభుత్వాలు పీపుల్స్ వార్ ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు వాడుకున్నాయి. అలాంటి ప్రయత్నం లో భాగంగానే కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు, బయపు సమ్మిరెడ్డి, నయీముద్దీన్ వంటి మాజీ నక్సలైట్లు పోలీస్ శాఖలో అల్లుళ్లలాగా సౌకర్యాలు పొంది, ప్రభుత్వం కోసం పనిచేసిన విషయం తెలిసిందే. ఏకు మేకు అయి కూర్చున్న అటువంటివారిని వదిలించుకోవడానికి ఆ తరువాత వాళ్ళ సృష్టికర్తలు పడిన పాట్లు కూడా అందరికీ తెలిసినవే. బహుశా 80వ దశకంలో తెలంగాణలో జరిగిన ఈ ప్రయత్నాలన్నిటి స్ఫూర్తితోనే 2005లో సల్వాజుడుం ఏర్పడిందేమో. కానీ ఈ సంస్థలు, వ్యక్తులూ చేయలేకపోయినంత హింస సల్వాజుడుం అస్తిత్వంలో ఉన్న చాలా స్వల్ప కాలం, ఐదారు సంవత్సరాలలోనే జరిగింది. సల్వాజుడుంకు నాయకత్వం వహించిన మహేంద్రకర్మ, అంతకు ముందు ఫియర్ వికాస్ కు నాయకత్వం వహించిన అన్నెబోయిన మల్లయ్య ఇద్దరూ ఆ తర్వాత కాలంలో హత్యకు గురయ్యారు. ఇటువంటి రాజ్యాంగేతర, చట్టవ్యతిరేక వ్యవస్థల్ని సృష్టించినవారు పెద్దగా సాధించింది ఏమీ లేదు, అమాయక ప్రజలు.. అందునా పెద్దసంఖ్యలో పేద గ్రామస్తులు, గిరిజనులు హింసాత్మక ఘటనల్లో మరణించడం తప్ప. ఇప్పుడు సల్వాజుడుం ప్రస్తావన తీసుకురావడానికి కారణం ఆ సంస్థను మూసివేయాలని తీర్పు ఇచ్చిన ఇద్దరు న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం జరగబోతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి తరపున పోటీకి దిగడం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించగా ఆ పార్టీ నాయకత్వంలో ఉన్న ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలన్నీ సమర్థిస్తున్నాయి. మొత్తం లోకసభ, రాజ్యసభ సభ్యులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నిక ఫలితం అందరికీ తెలిసిందే. ఇదొక సిద్ధాంతపరమైన పోటీయే. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ నిపుణులు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏ రాజకీయ పక్షానికీ చెందినవారు కాదు. నిజానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్, శాసనసభల స్పీకర్లు వంటి పదవుల్లో రాజకీయాలతో సంబంధంలేని వారిని నియమిస్తే నిష్పక్షపాతంగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. అయితే ఆ పరిస్థితి ఎప్పుడో పోయింది. ఇప్పుడు స్పీకర్లు, గవర్నర్లు, ఉపరాష్ట్రపతులు, రాష్ట్రపతుల పదవులను రాజకీయ పార్టీల నాయకులే అధిష్టిస్తున్నారు. ఎవరినీ నమ్మించలేని ఆరోగ్య కారణాలు చూపించి అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి కనీసం అధికారికంగా వీడ్కోలుకు కూడా నోచుకోకుండా జగ్దీప్ ధన్‌ఖడ్ అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా మాయమైన కారణంగా ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నిక అవసరం ఏర్పడింది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ తన అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ వ్యక్తి సిపి రాధాకృష్ణన్‌ను ఎంచుకున్నది. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి మాత్రం రాజ్యాంగ నిపుణుడు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, ఎంతో అనుభవం కలిగిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేసుకున్నది. ఇది కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు నచ్చలేదు. ఆయన సల్వాజుడుం విషయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి 2011లో ఇచ్చిన తీర్పును.. అంటే దాదాపు పద్నాలుగు సంవత్సరాల తర్వాత ఇప్పుడు ప్రస్తావించి ఆయన నక్సలైట్లకు అనుకూలుడని, ఆయన ఆ తీర్పు ఇచ్చి సల్వాజుడుంను రద్దు చేయించకపోయి ఉంటే 2020లోనే తాము నక్సలిజాన్ని అంతం చేసి ఉండేవాళ్ళమని వ్యాఖ్యానించారు.

# గర్భిణీ స్త్రీ మృతి కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

**- ఇలాటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు - ఆర్ఎంపీ లు ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు - లింగ నిర్ధారణ, అక్రమ అబార్షన్ నేరం**

**- నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు, వారికి ప్రోత్సాహం ఇవ్వాలి - డి.ఎస్.పి ప్రసన్న కుమార్**




**సూర్యాపేట / మోతే ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** మోతే మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భవతి బయ్యి అనూష మృతి చెందిన కేసులో నమ్మదగిన సమాచారంపై ముగ్గురు నిందితులను సూర్యాపేట పట్టణం రితిక హోటల్ వద్ద సోమవారం అరెస్టు చేయడం జరిగినది. అబార్షన్ చేయడానికి సూర్యాపేట పట్టణం ఒమేగా హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన ఆస్పటల్ నిర్వాహకులు ఏ1 గోరంట్ల సంజీవ, ఏ6 వీరబాయిన వేణు, స్కానింగ్ చేయడానికి అబార్షన్ చేయడానికి ఏర్పాటు చేసిన ఏ2 జాల జానయ్య లను అరెస్ట్ చేయడం జరిగినది.

**అరెస్ట్ చేసిన నిందితులు:**

ఏ1 – గోరంట్ల సంజీవ, సూర్యాపేట పట్టణ, ఒమేగా హాస్పిటల్ మేనేజ్మెంట్.

ఏ2 – జాల జానయ్య టేకుమట్ల గ్రామము, సూర్యాపేట మండలం, ఆర్ఎంపీ డాక్టర్.

ఏ6 – వీరబోయిన వేణు, సూర్యాపేట పట్టణం, ఒమేగా హాస్పిటల్ మేనేజ్మెంట్.

**కేసు వివరాలు:**

మోతే మండలం రాఘవపురం గ్రామానికి చెందిన భయ్యా నగేష్ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు భార్య బయ్య అనూష మూడోసారి గర్భం దాల్చి ఐదో నెల గర్భవతి ఉండగా గర్భంలో ఉన్నది ఆడ, మగ శిశు వు అని తెలుసుకోవాలని ఉద్దేశంతో తన దగ్గరి బంధువైన అదే గ్రామానికి చెందిన ఏ8 ఉప్పల సందీప్ ద్వారా టేకుమట్ల గ్రామంలో ఆర్ఎంపీ గా పని ఏ2 జాల జానయ్య ను సంప్రదించి నకిరేకల్ కు చెందిన ఆర్ఎంపీ ఏ3 బాత్క యాదగిరి వద్ది 17/05/2025 రోజున అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా అక్రమ స్కానింగ్ నిర్వహించి గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని తెలుసుకుంటారు. దీనికి గాను జానయ్య మృతురాలి భర్త ఏ9 బయ్య నగేష్ నుండి రూ.12 వేల రూపాయలు తీసుకున్నాడు.

గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని తెలిసిన అనంతరం అబార్షన్ చేయించాలనే ఉద్దేశ్యంతో ఏ2 జానయ్య ద్వారా తేది: 17/05/2025 రోజున సూర్యాపేట పట్టణంలో గల ఒమేగా హాస్పటల్ (సంజీవిని హాస్పటల్ ) కు వచ్చి ఏ1 గోరంట్ల సంజీవ, %ూ%6 వీరబోయిన వేణును సంప్రదించి కూసుమంచి కి చెందిన ఆర్.ఎం.పి నాగరాజు, అర్వపల్లి కి చెందిన ఆర్.ఎం.పి చెవుగొని గణేష్ లతో అబార్షన్ చేయిస్తారు. అబార్షన్ వికటించి తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమించడంతో ఖమ్మంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్ష చేసిన వైద్యులు 5నెల గర్భవతి అయిన భయ అనూష మృతి చెందినది అని నిర్ధారించారు, మృత్చెందిన అనూషను అదే రోజున రాఘవపురం గ్రామంలో అంత్యక్రియలు చేశారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా నేరం సంఖ్య 197/2025 ప్రకారం సెక్షన్ 105, 90 భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్), మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ 23, ప్రి కన్సెప్షన్ ప్రి నటల్ డయాగ్నటిక్ టెక్నిక్స్ ఆక్ట్ 1994 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి పదిమంది నిందితులుగా చేర్చడం జరిగినది.

**నిందితులు :**

ఏ1 – గోరంట్ల సంజీవ, సూర్యాపేట పట్టణ, ఒమేగా హాస్పిటల్ మేనేజ్మెంట్.

ఏ2 – జాల జానయ్య టేకుమట్ల గ్రామము, సూర్యాపేట మండలం, ఆర్ఎంపీ డాక్టర్.

ఏ3 – బాత్క యాదగిరి, నకిరేకల్ పట్టణం, ఆర్ఎంపీ డాక్టర్. (అరెస్ట్ 08/08/2025)

ఏ4 – నాగరాజు, కూసుమంచి, ఖమ్మం జిల్లా, ఆర్ఎంపీ డాక్టర్.

ఏ5 – చౌగాని గణేష్, అర్వపల్లి గ్రామం, ఆర్ఎంపీ డాక్టర్. (అరెస్ట్, మే 29వ తేది)

ఏ6 – వీరబోయిన వేణు, సూర్యాపేట పట్టణం, ఒమేగా హాస్పిటల్ మేనేజ్మెంట్.

ఏ7 – పిడమర్తి శోభ సూర్యపేట టౌన్, హాస్పిటల్ నర్స్.

ఏ8 – ఉప్పల సందీప్, సర్వారం గ్రామం, మోతే మండలం. (అరెస్ట్, మే 29వ తేది)

ఏ9 – భయ్యా నగేష్, మృతురాలి భర్త, రాఘవపురం, మోతే మండలం.

ఏ10 – తొట్ల గణేష్, వర్ధమానుకోట గ్రామం, నాగారం మండలం, నివాసము విద్యానగర్ సూర్యాపేట.

కేసు దర్యాప్తు చేసి ఇందులో నిందితుడైన ఏ8 ఉప్పల సందీప్ హాస్పటల్లో పనిచేసిన అనుభవం నుండి టేకుమట్ల గ్రామానికి చెందిన జానయ్యను సంప్రదించదానికి మృతురాలి భర్తకు సహాయం చేశాడు, సందీప్ ను మే నెల 29వ తారీఖున అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడం జరిగింది, అబార్షన్ చేసిన ఏ5 చౌవుగోని గణేష్ ను మే నెల 29వ తారీకు అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగింది. నకిరేకల్ నందు మృతురాలికి స్కానింగ్ చేసి ఆడ శిశు అని నిర్ధారించిన ఆర్ఎంపీ డాక్టర్ బత్క యాదగిరిని ఆగస్టు ఎనిమిదో తారీఖున అరెస్టు చేసి రిమాండ్ పంపడం జరిగింది. కేసు తదుపరి విచారణ జరిపి నమ్మదగిన సమాచారంపై హోటల్ రిధిక వద్ద ఉన్నారనే సమాచారం పై పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు అరెస్టు నిందితులైన ఏ1 గోరంట్ల సంజీవ, ఎ2 జాల జానయ్య, ఏ6 వీరాబోయిన వేణు లను నమ్మదగిన సమాచారం పై సోమవారం ఉదయం అరెస్టు చేయడం జరిగినది. ఏ2 నిందితుడైన జాల జానయ్య అబార్షన్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. హాస్పిటల్ మేనేజ్మెంట్ ఏ1 సంజీవ, ఏ6 వీరబోయిన వేణు అబార్షన్ చేయడానికి హాస్పిటల్లో ఏర్పాటు చేయడం జరిగింది.

# మహిళా భద్రత, గౌరవానికి పోలీస్ కృషి

- మహిళా ఉద్యోగులకు, గృహిణులకు, బాలికలకు చట్టపరమైన రక్షణ, న్యాయ సహాయం అందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుంది
- పని ప్రదేశంలో లేదా గృహంలో, సమాజంలో ఏరకంగానైనా మహిళలకు జరగుతున్న వేధింపులపై ధైర్యంగా పిర్యాదు చేయాలి: జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్






**సూర్యాపేట క్రైమ్, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** పని ప్రదేశంలో ఆత్యాచార, వేదింపులు నిరోధక చట్టం – 2013 POSH ACT – 2013" (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్) కు సంభందించి జిల్లా పోలీసు కార్యాలయం నందు మహిళా పోలీసు అధికారులకు, మహిళా రక్షణ విభాగం సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమం వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ హాజరై శిక్షణ ను ఉద్దేశించి మాట్లాడారు, సలహాలు, సూచనలు అందించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేదింపులు, సమస్యలపై పోలీసు మహిళా సిబ్బంది స్పందించి సహాయ సహకారాలు అందించాలి అన్నారు. వేధింపులపై ధైర్యంగా పిర్యాదు చేసి వాటి నిర్మూలనకు పాటుపడాలి అన్నారు. మహిళా పోలీస్ యూనిఫాం ధరించి రోడ్డు పై కనిపిస్తే ఆకతాయిల మదిలో అలజడి ఏర్పడుతుంది, భయం కలుగుతుందని అన్నారు. మహిళా సాధికారిత, మహిళా శక్తి, చట్టాల అమలులో మహిళల పాత్ర, పని ప్రదేశం లో వేధింపులను నిరోధించడంలో బాగా పని చేయాలని సూచించారు. మహిళా ఉద్యోగులు పని ప్రదేశంలో వివిధ రకాల వేధింపులకు గురవుతున్నట్లు అనేక సందర్భాల్లో మీడియాలో ప్రచురితమైనది, కేసులు నమోదు అవుతున్నాయని వీటిని నిర్మూలించడంలో మహిళలు శక్తివంతంగా ఉండాలని ధైర్యంగా ఫిర్యాదు చేసి వేధింపులను అరికట్టాలని కోరారు. సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "POSH ACT - 2013" (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్) ప్రకారం జిల్లా పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి అధ్వర్యంలో ఒక ఇంటర్నల్ కమిటీని కూడా ఏర్పాటు చేశాం, అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నందు కూడా సంభందిత అధికారుల అధ్వర్యంలో ఆఫీస్ ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేశారు, జిల్లా స్థాయిలో జిల్లా కలక్టర్ కార్యాలయం నందు శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో కమిటీ పని చేస్తుందన్నారు. ఉద్యోగ స్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, చట్టపరమైన నిబంధనలు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ మార్గాలు గురించి అన్ని కార్యాలయాల్లో అవగాహన కల్పించాలి, వీటిని నిరోధించాలన్నారు. మహిళా ఉద్యోగులకు చట్టపరమైన రక్షణ, న్యాయ సహాయం అందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి దయానందరాణి, బెటి బచావో బిటి పడావో నిర్వహుకురాలు చైతన్య, పోలీసు కార్యాలయం ఏవో మంజు భార్గవి, జిల్లా మహిళా బరోసా సెంటర్ ఎస్సై మౌనిక, జిల్లా షీ టీమ్స్ ఎస్సై నీలిమ, బరోసా సెంటర్ లీగల్ అడ్వైజరీ జ్యోతి, కరుణశ్రీ, మహిళా ఏఎస్ఐ సైదాబి, జ్యోతి, అరుణ, కవిత, పోలీస్ స్టేషన్ రిషప్షన్ సెంటర్స్ మహిళా సిబ్బంది, షీ టీమ్స్, బరోసా సెంటర్ సిబ్బంది ఉన్నారు.

## సిబిఐ విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్ ను వేధిస్తున్నారని ధర్నా : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

**తుంగతుర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** మాజీ సీఎం కేసీఆర్ వేధించడానికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ లు సీబీఐ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. కేసీఆర్ పై సీబీఐ విచారణకు నిరసనగా తుంగతుర్తిలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహానికి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేసి మెయిన్ రోడ్ పై ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం (బీజేపీ) కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కుట్ర కోణంతో సీబీఐ విచారణ అంటున్నారని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గం సాగు, తాగు నీరు లేక ఎంతో ఇబ్బందులకు గురయ్యారని, ఇలాంటి ప్రాంతానికి మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం చేసారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేంధర్రావు, ఎస్ఏ రజాక్, పాపికొండ సీతయ్య, శోభన్ బాబు ఇతరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారాన్ని నిరసిస్తూ నల్లజెండాలతో నిరసన ర్యాలీ



**సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 01,(సూర్య సేన):** కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాస్తవాలను ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్రెడ్డి అన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారాన్ని నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేటలో సోమవారం నల్లజెండాలు పట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కష్టాలను పట్టించుకోకుండా విలాసాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెరుమాళ్ల అన్నపూర్ణ, పుట్టా కిషోర్ కుమార్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, కొనతం సత్యనారాయణ రెడ్డి, ఉప్పల ఆనంద్, మొరిశెట్టి శ్రీనివాసులు, తూడి నర్సింహ్మారావు, శ్రీనివాసరెడ్డి, తహేర్ పాష, సవరాల సత్యనారాయణ, దొంగరి యుగంధర్, గాలి సాయికుమార్, రఫీ, అనిల్ రెడ్డి, టైసన్ శ్రీను, కొండ మధు పాల్గొన్నారు.

## విఘ్నాలు తొలగి అందరికి శుభాలు కలగాలి

భానుపురి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):
విఘ్నాలు తొలగి గణనాథుని ఆశీస్సులతో అందరికి శుభాలు కలగాలని శ్రీ వాసవి సేవాసమితి సభ్యులు శ్రీ రంగం రమేష్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గల శ్రీ కనక దుర్గమ్మ గుడి ప్రాంతములో టీం శ్రీ దుర్గా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 4 వార్షికోత్సవ సందర్భముగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద కుటుంబ సమేతముగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆది దేవుడుగా భావించే వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. గణపతి నిమజ్జనం కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం పద్మ, వంశీకృష్ణ, సంతోషి,చరణ్, అఖిల్,రాము, వివేక్ , యశ్వంత్ గణేష్, శ్రీరామ్, కౌశిక్, సాయి కృష్ణ, విఘ్నేష్,శివమణి, చక్రి , గోపి,చందు, శ్రీకాంత్, శ్రీనివాస్, నవీన్,శ్రవణ్, సిద్దు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా వాసి పటేల్ శ్రీధర్ రెడ్డి కి డాక్టరేట్

- పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపడమే స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవ సంస్థ లక్ష్యం లయన్ డాక్టర్ పటేల్ శ్రీధర్ రెడ్డి
- నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవ సంస్థ స్థాపించి దాదాపుగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకునే ముందు సాగడం అభినందనీయం లోక కవి అందెశ్రీ, తెలంగాణ పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి











**సూర్యాపేట, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** సూర్యాపేట జిల్లా బాలెంల గ్రామానికి చెందిన స్ప్రెడ్ ఇంటర్నేషనల్ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి మర్యాలాండ్ యూఎస్ఏ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం అభినందనియమని లోక కవి అందెశ్రీ అన్నారు. శ్రీధర్ రెడ్డి అభినందన సభను ఆదివారం బాలాజీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. పౌర సన్మాన సభకు ముఖ్య అతిధులుగా అందె శ్రీ తెలంగాణ పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కవి అందెశ్రీ మాట్లాడుతూ స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవ సంస్థ స్థాపించి దాదాపుగా 25 సంవత్సరాలు గా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించరన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా మారుమూల ప్రాంతాల్లో వయోజన విద్య కేంద్రాలు నెలకొల్పి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా బోధనకు విద్య వాలంటీర్ లను నియమించి వారికి తన సొంత నిధితో వారికి గౌరవ భృతి ఇస్తూ అనేక మంది విద్యారుల జీవితాల్లో వెలుగులు నింపి వారి ఉన్నతికి కృషి చేస్తున్న పటేల్ శ్రీధర్ రెడ్డి ని అభినందించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో 44 పాఠశాలల్లో పదవ తరగతి లో ప్రధమ ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏడు సంవత్సరాల పాటు 2000 నుండి 3000 రూపాయల స్కాలర్షిప్ లు అందిస్తూ వారి ఉన్నత అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా బాలెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ కు దీటుగా కంప్యూటర్లు ప్రొజెక్టర్లు, గ్రీన్ బోర్డులు, డెస్క్ బెంజీలు, సైన్స్ లేబరేటరీ, గ్రంథాలయం, కళావేదిక వంటగదులు, మోడల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారని అంతేకాక రెండు ఎకరాల క్రీడాస్థలాన్ని ఉచితంగా పాఠశాలకు అందించి బాస్కెట్బాల్ కోర్టును నిర్మించారని, తను చదువుకున్న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలవస్తలో ఉండడాన్ని గమనించి నూతన భవన నిర్మాణానికి తన నిధులతో పాటు ప్రభుత్వ సహకారంతో 45 లక్షల వ్యాయామంతో నిర్మాణం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఇలాంటి సేవా దృక్పథం ఉన్న శ్రీధర్ రెడ్డి తమ్ముడిగా జన్మించడం నాకు గర్వంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు సుధా బ్యాంకు ఎండి పెద్దిరెడ్డి గణేష్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, పట్టణ ప్రముఖులు, డాక్టర్ రామూర్తి, చిన్న శ్రీరాములు, గండూరి శంకర్, సీనియర్ అడ్వకేట్ శశిధర్ రెడ్డి, ఏజీపి సవీందర్ గౌడ్, త్రికుళ్ల సాయి రెడ్డి, తోట శ్యాంప్రసాద్, ఇరుగు కోటేశ్వరి, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు యామ ప్రభాకర్, డాక్టర్ వల్లపట్ల దయానంద్, ఖలీల్ అహ్మద్, క్రాంతి నారాయణ, పెద్దిరెడ్డి రాజా, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఏజిపి షఫీ ఉల్లా ఖాన్, వెలుగు ఎంకన్న, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**హైదరాబాద్ జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** రహమత్ నగర్ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రివర్యులు గడ్డం వివేక్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమాత్ నగర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ , జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి మరియు రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజారుద్దీన్, రహమత్ నగర్ కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొత్తం రూ. 4.60 కోట్ల వ్యయంతో రహమత్‌నగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు మరియు మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. రానున్న రోజుల్లో రహమత్ నగర్ డివిజన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని, ప్రతి వాడా, బస్తీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. రానున్న ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలు ఇచ్చిన నమ్మకానికి తగ్గట్టుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కార్పొరేటర్ సిఎన్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్ యాదవ్, భవాని శంకర్ తదితరులు హాజరయ్యారు.

## కామర్స్ గెస్ట్ ఫ్యాకల్టీ దరఖాస్తులు ఆహ్వానం




**కోదాడ ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** కోదాడలోని కె.ఆర్.ఆర్. ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ (వాణిజ్యశాస్త్రం) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హదస రాణి తెలిపారు. బీసీ, ఓసీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు మరియు బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందని, 4వ తేదీ గురువారం డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తమ అసలు సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్ డాక్టర్ హదస రాణి, కె.ఆర్.ఆర్. ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల, కోదాడ. సెల్: 7287926279.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**రంగారెడ్డి, సెప్టెంబర్ 01 (సూర్యసేన):** ప్రధానిగా నరేంద్ర మోడీ భారత దేశ దశ దిశ మారుస్తున్నారని భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామా రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఎల్బీనగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సామా రంగారెడ్డి మాట్లాడుతూ. బీహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్. ప్రధాని తల్లినిదూషించారన్నారు. అందుకే నిరసన వ్యక్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో రామేశ్వర్, నూతి శ్రీనివాస్, సుందర నారాయణ, నాగిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో గోపూజ, అన్నదానం



**మేళ్లచెరువు ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన నిర్వహించగా అనంతరం గోపూజ నిర్వహించారు. తరువాత మహానివేదన, మంగళ నీరాజనం, తీర్థప్రసాద వినియోగం అనంతరం మల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన సూరే వీరాంజనేయులు, వారి ధర్మపత్నీ పద్మ అన్నదానాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణా ధికారి నాగేళ్ల శంభిరెడ్డి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ శాగం శంభిరెడ్డి, సభ్యులు కర్నాటి సత్యనారాయణరెడ్డి, కమతం శ్రీనివాసరావు, వున్నూరు వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ, దనుంజయ శర్మ, సిబ్బంది కొండారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి అనుగ్రహం పొందారు.

## రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం



**హుజూర్‌నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** దేశ ప్రధానమంత్రి మాతృమూర్తిని అవమానించేలా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ మోడీ కుటుంబాన్నికించపరిచే రీతిలో మాట్లాడటం సిగ్గుచేటు, ఇదిభారతీయసంస్కృతికివిరుద్ధమని అన్నారు. దేశ ప్రజలగౌరవాన్నిదెబ్బతీసే విధంగా ప్రవర్తించే తీరును రాహుల్గాంధీ విడిచిపెట్టాలని, మహిళలనుముఖ్యంగాప్రధానమంత్రి కుటుంబాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ దేశ మహిళలకు, మోడీ తల్లికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దేనుమకొండ రామరాజు, ఇంటి రవి, మేళ్లచెరువు లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, పట్టణ ఉపాధ్యక్షుడు పైడిమర్రి విజయ్, కంటు నాగరాజు, బల్వంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి తరలిన బొజ్జ గణపయ్య



**రంగారెడ్డి, సెప్టెంబర్ 01 (సూర్య సేన) :** మహేశ్వరం నియోజకవర్గం, మీర్పేట డివిజన్ పరిధిలో భాగ్యనగర్ ఉత్సవ సమితి మహేశ్వరం కన్వీనర్ కీసర గోవర్ధన్ రెడ్డి కో కన్వీనర్ సోమేశ్వర్ అధ్యక్షులు చిల్లంపల్లి రాజశేఖర్ గౌరవాధ్యక్షులు కీసర హరినాథరెడ్డి బిక్షపతి చారి ప్రధాన కార్యదర్శి పల్లె రంగయ్య గౌడ్ కార్యదర్శులు నరసింహ యాదవ్ వెంకటేష్ గౌడ్ నేపథ్యంలో, బొజ్జ గణపయ్య నిమజ్జనానికి తరలి వెళ్లారు. దీనితో యువకులు పిల్లలు కేరింతలు కొడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన జరిగిన నష్టం అంచనాలు రూపొందించాలి : జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్




**సూర్యాపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** ఇటీవల కురిసిన భారీ వర్షాలు వల్ల జరిగిన నష్టం అంచనాలు రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుండి భారీ వర్షాలు , వరద నష్టాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మానవ నష్టం, పశు నష్టం, కూలిన ఇండ్లు, ఇటీవల భారీ వర్షాలకు ఆర్ అండ్ బి, రహదారులు, లో లెవల్ కల్వర్ట్ లు, బ్రిడ్జిలు దెబ్బతినడం జరిగిందని, అలాగే పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రోడ్లు, గ్రామ పంచాయతీ బిల్డింగ్స్ లాంటి వాటిపై నష్టం అంచనా వివరాలను, వరదల వల్ల పొలాలలో ఇసుక మేటలు పెట్టడం, పంట నష్టం, మిషన్ భగీరథ పైప్ లైనింగ్ కి జరిగిన నస్టాలు , మున్సిపాల్టిలలో జరిగిన నష్టాలపై నివేదికలు సమర్పించాలని, పునరావాస కేంద్రాలకి సంబందించిన వివరాలు, ఇరిగేషన్ అధికారులు కాల్వలు, చెరువులు, మైనర్ మేజర్ ప్రాజెక్ట్ ల కి చెందిన నష్టం వివరాలని క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాలపై వేగవంతంగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ & బి, పంచాయతీ రాజ్ శాఖ ల కి చెందిన రోడ్లు తెగిపోవటం, లోలెవల్ కాజ్ వే లు, కల్వర్ట్ ల డ్యామేజ్, ఇరిగేషన్ కి సంబంధించి మైనర్, మేజర్ ప్రాజెక్ట్ లకి, చెరువు కట్టలకి చేయాల్సిన మరమ్మత్తులు సంబందించిన వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదల వల్ల పంచాయతీ రాజ్, ఆర్ & బి రోడ్లు, అగ్రికల్చర్, విద్యుత్ మిషన్ భగీరథ, ఇరిగేషన్ తదితర శాఖలకి సంబందించిన నష్టాలపై వేగవంతంగా నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రెవిన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీ రాజ్ గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సి ఎస్ రామకృష్ణారావు, సీనియర్ ఐ ఏ ఎస్ అధికారులు, ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో పలు సూచనలు చేశారు. ఎస్పి కే నరసింహ, ఆర్డీఓ వేణుమాధవ్, జడ్పీ సిఈఒ వివి అప్పారావు, డి ఏ ఒ శ్రీధర్ రెడ్డి, ఆర్ & బి ఈఈ సీతారామయ్య, పి ఆర్ ఈఈ వెంకటయ్య, టీ జి ఎస్ పి డి సి ఎల్ ఎస్ ఈ ఫ్రాంక్లిన్, సి పి ఒ కిషన్, మిషన్ భగీరథ ఈ ఈ అరుణాకర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ శ్రీనివాసరావు, డి పి ఒ యాదగిరి, డి ఎఫ్ ఒ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారి నవికాంత్, పశు సంవర్ధన అధికారి శ్రీనివాస రావు, హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఫిషరీస్ అధికారి నాగులు, మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి తదితరులు ఈ వీడియో కాన్ఫిరెన్స్ కి హాజరయ్యారు.

## బీసీ హక్కుల సాధన సమితి పోరాటాల ఫలితమే రిజర్వేషన్లు : ధనుంజయ నాయుడు



**హుజూర్‌నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హక్కుల సాధన సమితి చేసిననిరంతర పోరాటాలఫలితంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు లభించాయని ఆ సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళధనుంజయ నాయుడు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ బీసీ భవన్‌లో జరిగిన బీసీనాయకుల సమావేశంలో మాట్లాడుతూ 33 జిల్లాలు, 600 మండలాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో చేసిన పోరాటాల ఫలితంగానే ఈ రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని తెలిపారు. బీసీ ఉద్యమాన్ని అడ్డంగా పెట్టుకొని పదవులు, అక్రమ సంపాదన కోసం పార్టీలు మారుతూ బూటకం సత్యాగ్రహ దీక్షలు చేసినవారికి ఇది చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. గతంలో బిఆర్ఎస్ బీసీల రిజర్వేషన్లపై తీర్మానం చేసేందుకు కూడాభయపడ్డప్పటికీ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు అశోక్, పసుపులేటి సోమయ్య, శ్రీనివాస్, జక్కుల రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుగులోతు నాను నాయక్ దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన బిజెపి నాయకులు

**మోతే ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్యసేన):** సూర్యాపేట జిల్లా మోతే మండలం పరిధిలో బిజెపి పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బానోతు శ్రీను నాయక్ మామగారైన నూతనకల్ మండల పరిధిలో బక్కహేమ్లా తండాకు గ్రామానికి చెందిన గుగులోతు నాను నాయక్ దశదిన కార్యక్రమంలో మోతే మండల బిజెపి నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతే మండల బిజెపి అధ్యక్షులు భూక్య శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి పెరుగు మధు యాదవ్, ధర్మారెడ్డి, నాగ వెంకటేశ్వర్లు, సైదా నాయక్, రామచంద్రయ్య, నవీన్ లింగయ్య, బానోత్ వెంకన్న, శ్రీకాంత్, గ్రామ నాయకులు మండల నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## శంభులింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి



**మేళ్లచెరువు ప్రతినిధి సెప్టెంబర్ 01 (సూర్య సేన):** హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి పి. మారుతి ప్రసాద్ సోమవారం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవస్థానాన్ని సోమవారంసందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేళ్ల శంభిరెడ్డి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ శాగం శంభిరెడ్డి జడ్జిని ఆహ్వానించి స్వాగతం పలికారు. అనంతరంస్వామివారిశేషవస్త్రముతోసత్కరించగాఆలయఅర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన శర్మ, ధనుంజయ శర్మ తీర్థప్రసాదంఅందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది కె. కొండారెడ్డినర్సింహారెడ్డి, పోలీసుసిబ్బందిపాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణికి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### - పిర్యాదుదారులతో మాట్లాడి పిర్యాదులు పరిశీలించిన ఎస్పీ కె నరసింహ ఐపిఎస్




**సూర్యాపేట క్రైమ్, సెప్టెంబర్ 01 (సూర్య సేన):** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదు దారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

## బీసీ వర్గాల జీవితాలలో వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

### - బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**రంగారెడ్డి, సెప్టెంబర్ 01 (సూర్యసేన) :** ఆదివారం అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరుతున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆదివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ లుఅమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన, నేపథ్యంలో, రాష్ట్ర మంత్రివర్గానికి, ఏ.ఐ.సి. సి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కి లోక్ సభప్రధాన ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీకి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఏఐసిసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ కి మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాల వ్యాప్తంగా బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఈ 42 శాతం రిజర్వేషన్లు బీసీ వర్గాలలో, వారి జీవితాలలో వెలుగు నింపుతుంది అనడంలో అతిశయోక్తి లేదు అన్నారు. ఈరోజును సువర్ణ అక్షరాలలో లిఖించదగ్గరోజని, ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్న నేపద్యంలో బీసీలు సంబరాలు చేసుకోవాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

సూర్యసేన

మంగళవారం, సెప్టెంబర్ 2, 2025

# అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న



భానుపురి, సెప్టెంబర్ 01 (సూర్య సేన): వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి మాట్లాడుతూ అన్ని దానముల కన్నా అన్నదానం ఉత్తమమైనదని అన్నారు. వాసవి వారోత్సవాల్లో భాగంగా వ్యవస్థాపకులు కేసి గుప్త జయంతి సందర్భంగా వనిత క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర దేవాలయం విద్యానగర్ నందు నకిరేకంటి నాగమణి క్యాటరర్ వారి సహకారంతో 200 మందికి అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఈఎఫ్ ఆఫీసర్ తోట శ్యాం ప్రసాద్ , క్యాబినెట్ సెక్రటరీ బికుమల్ల కృష్ణ, ఆర్సి తోణుకునూరి సంతోష్, గోసేవ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ మిట్టపల్లి రమేష్, జూలకంటి నాగరాజు, సెక్రటరీ పాలవరపు భవాని, ట్రెజరర్ లకుమారపు పద్మజ, వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరి కవిత, మరియు వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ నకెరికంటి ప్రసాద్ కన్నుమూత



గరిడేపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన): హుజూర్నగర్ నియోజకవర్గం గరిడేపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, మాజీ సర్పంచ్ నకెరికంటి ప్రసాద్ గురువారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలిసి గ్రామంలో శోకసంద్రం నెలకొంది. రాజకీయాల్లో సుపరిచితుడైన ప్రసాద్ ప్రజలతో మమేకమై సేవచేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు, నాయకులు ప్రార్థిస్తున్నారు.

# హుజూర్‌నగర్‌లో దొంగతనం కలకలం

హుజూర్‌నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01(సూర్య సేన): పట్టణంలోని పేరూరి భాగ్యరాజు ఇంట్లో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. భార్యను అత్తగారి ఇంటి నుండి తీసుకురావడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట గ్రామానికి వెళ్లిన భాగ్యరాజు రెండు రోజులు అక్కడే ఉండి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా గదిలో వస్తువులు చిందరవందరగా, బీరువాలు పగలగొట్టినట్లు కనిపించాయి. బీరువా పరిశీలించగా హారం, నల్లపూసల త్రాడు, పుస్తెలతాడు, మూడు ఉంగరాలు, కాళ్లపట్టీలు, కడియాలు, కుందులు, ఒక వెండి ప్లేటు, నగదు తదితరాలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఘటనపై ఫిర్యాదు చేయడంతో ఎస్సై మోహన్ బాబు నేరస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆది శ్రీనివాస్ సీఎం అవుతారు: బిజెపి ఎమ్మెల్యే పాయల శంకర్

రంగారెడ్డి సెప్టెంబరు 01 (సూర్య సేన): ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాసకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయని, అయితే ఆయన వరకు ప్రతి ఫలాలు వెళ్లే పరిస్థితులు కాంగ్రెస్ లో లేవని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ బీసీ రిజర్వేషన్లు వస్తున్నాయి అంటే తెలంగాణ బీసీ సమాజం అంత సంబరపడిందని మిఠాయిలు పంచుకున్నారని గుర్తు చేశారు .అసెంబ్లీలో పంచాయతీరాజ్ మున్సిపల్ అమెండ్మెంట్ బిల్లులపై చర్చలో భాగంగా మాట్లాడిన బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సంచలనవాక్యాలు చేశారు. 42 శాతం రిజర్వేషన్లు మొత్తం బీసీలకు ఇస్తారా? అందులో 10 శాతం ముస్లింలు లేరా? అని ఆయన ప్రశ్నించారు దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42 కు 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని ప్రభుత్వము ఎందుకు స్పష్టత ఇవ్వలేకపోయిందని నిలదీశారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ల నుంచి ఆరు శాతం పెంచే విధంగా జీవోలో పొందుపరిచారనిధ్వజంమెత్తారు. కాంగ్రెస్ బీసీలను ఊహల పల్లకిలో ఊరేగిస్తూ.నిలువు నామోసం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో రెండు స్థానాలు బీసీలకు ఇవ్వని కాంగ్రెస్ బీసీలకు ఏదో వరగా పెడతానంటే నమ్మలేమని అన్నారు. ముఖ్యమంత్రి పదవులు మీకు అధ్యక్ష పదవులు మాక! అని ఆగ్రహం వ్యక్తం చేశారు బీసీ రిజర్వేషన్ బిల్లు కు బిజెపి పూర్తి మద్దతు ఇస్తుందని పాయల్ శంకర్ అన్నారు. బీసీలకు ఉన్న అనుమానాలను ప్రభుత్వంనివృత్తిచేయాలని కోరారు. కామారెడ్డి డిక్లేర్ రేషన్ పై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ రిజర్వేషన్ 42 శాతం కేవలంబీసీలకేనని దీనిలో వేరేవారిని రానివ్వమని స్పష్టతనిచ్చారు.

# జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ





మంగపేట, సెప్టెంబర్ 01 (సూర్య సేన): ఎంపీపీ ఎస్ బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీర రాజేందర్ అధ్యక్షతన పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు స్టేషనరీస్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు అవసరాలు ఉన్నాయని సామాజిక వేత్త,సోషల్ వర్కర్, కర్రీ రామ్మోహన్ ని సంప్రదించగా జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్ కు ఈ విషయం చెప్పగా మునిగాల రాకేష్ తన స్నేహితుడు అయినట్టువంటి వెంకట్ సుశాంత్ పిప్పళ్ల. యూఎస్ఏ (ఎన్ఆర్ఐ) కి ఈ విషయం తెలియచేయగానే తన పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు 3000/- విలువచేసే స్టేషనరీస్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల, ద్వారా అందజేశారు. తదుపరి ఉపాధ్యాయులు పిల్లలు, పూర్వ విద్యార్థులు గ్రామ పెద్దలు గ్రామ నాయకులు, సుశాంత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వారి సేవా గుణానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ , ప్రధానకార్యదర్శి కోడెల నరేష్ , రాకేష్ లు మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి శుభకార్యాలు జరుపుకునేవారు మా ఈ జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ కి సహకరించినచో ఇలాంటి బీదవారికి మీ పేరు మీద ఎన్నో కార్యక్రమాలు చేపడతామని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు మాకు సహకరించే దాతలందరికి పేరు పేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు

# గ్రామాలలో మౌలిక సమస్యలు పరిష్కరించాలి

## - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు





సూర్యాపేట / చివ్వెంల, సెప్టెంబర్ 01 (సూర్య సేన): గ్రామాలలో నెలకొన్న మౌలిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని తిరుమలగిరి, గుంపుల గ్రామాలలో ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ చివ్వెంల మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పోరు బాటలో భాగంగా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. ప్రభుత్వం రెండు సంవత్సరాల అవుతున్న గ్రామపంచాయతీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజలు సమస్యలు చెబుదామనుకుంటే వినేవారు దిక్కులేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల మూలంగా దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు 20వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల మూలంగా వీధుల్లో నీళ్లు నిలువ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అంటు రోగాలు, విష జ్వరాల బారిన పడుతున్నారని అంటువ్యాధులు, విష జ్వరాల వారి నుండి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడినందుకు ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ్య నిధులు విడుదల చేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న చివ్వెంల తాసిల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇ ట్టమల్ల స్టాలిన్, సిపిఎం మండల కమిటీ సభ్యులు బచ్చల కూర రామ్ చరణ్, కొల్లూరి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శి తాందారపల్లి నాగయ్య, నాయకులు ఉడుముల రాములు, మున్న మధు యాదవ్, కొల్లూరి ఎల్లయ్య పాల్గొన్నారు.

# గిరిజన గురుకులంలో ప్రవేశాలు కల్పించారు బోధన మరిచారు

## - పర్యవేక్షణ లేని ఆర్.సి.ఓ. మూడు నెలలు గడుస్తున్న ముందుకు సాగని ఇంటర్ విద్య

తుంగతుర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన): తుంగతుర్తి మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలలో మూడు నెలలు గడిచిన నేటి వరకు పూర్తిస్థాయిలో అధ్యాపకులు అందుబాటులోకి రాకపోవడంతో విద్యకు దూరమయ్యామని తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గురుకులంలో మహిళ అధ్యాపకుల కోసం జిల్లా అధికారులు పేపర్లో ప్రకటనలు చేసినప్పటికీ నేటి వరకు ప్రధాన సబ్జెక్టులకు అధ్యాపకులు రాకపోవడం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. గత పది సంవత్సరాల నుండి ఇంటర్ విద్యార్థులకు పురుష అధ్యాపకులు బోధించేవారని ప్రస్తుత ప్రభుత్వంలో గిరిజన గురుకుల ఆర్ సి ఓ తీసుకున్న నియంత పాలనతో పురుష అధ్యాపకులు కనుమరుగైపోయారుని మహిళ అధ్యాపకుల కోసం ప్రకటన చేస్తే ఎవరు రాకపోవడంతో నేడు ప్రధాన గ్రూపులలో బోధించడానికి అధ్యాపకులు అందుబాటులోలేరని దీనితో తరగతిగదిలో చదువు చెప్పేవారు లేక మూడు నెలలు పూర్తయిన మూడు పేజీల చదువు ముందు సాగలేదని మా చదువులు ఇంతేనా మా బ్రతుకులు ఇంతేనా అని కేవలం తిండి పెట్టి




పడుకోబెడుతున్నారని ఇంటర్ విద్యార్థులు వాపోతున్నారు. తక్షణమే గిరిజన విద్యార్థుల ప్రయోజనాల దృష్ట ఇంటర్ ప్రధాన సబ్జెక్టులను బోధించడానికి అవసరమైతే ప్రస్తుతం పురుష అధ్యాపకులను తీసుకొని విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తేవాలని ఫిజిక్స్, కెమిస్ట్రీ,తెలుగు,ఎకనామిక్స్ బోధనకు అధ్యాపకులు లేరని పలువురు విద్యార్థి సంఘ నాయకులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆశా వర్కర్ల అరెస్ట్ అక్రమం..

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 01 (సూర్య సేన): చలో హైదరాబాద్ కార్యక్రమం ఆశ యూనియన్ పిలుపు ఉన్నదని సోమవారం ఇంట్లో ఉన్న ఆశాలను అరెస్టు చేయడం హేయమైన చర్య అని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు ఆశా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంపటి గురూజీ ప్రభుత్వం ను విమర్శించారు.వెట్టి చాకిరీ చేస్తున్న ఆశాల పై కనీసం కనికరం లేకుండా మహిళలు అని చూడ అరెస్ట్ చేయడం ఏమిటని అన్నారు. ఆశాలు గొంతెమ్మ కోర్కెలు ఏమి కోరడం లేదని ఫిక్సడ్ వేతనం ఇరవై వేలు ఇవ్వాలని, ప్రమాద భీమా, ఇన్సూరెన్స్ 50లక్ష లు ఇవ్వాలని, అర్హులైన వారిని ఏఎన్ఎం లు అవకాశం కల్పించాలని రిటైర్ మెంట్ బెనిఫిట్స్ 5లక్షలు ఇచ్చి వారి కుటుంబం లో ఒకరి కి అవకాశం కల్పించాలని, చనిపోతే మట్టి ఖర్చులకు 30వేల రూపాయలు ఇవ్వాలని, ఆశాల పై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ కు వెంటనే వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని లేనిచో రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వం ను హెచ్చరించారు. అనంతరం



అరెస్ట్ చేసి సొంత పూచి కత్తు పై విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో ఆశా యూనియన్ పట్టణ అధ్యక్షురాలు సక్కుబాయి, యూనియన్ నాయకులు బైనా బాయి, నాగలక్ష్మి, నవ్య, మరియమ్మ, వెంకటరమణ, తులిషమ్మ, ఉమా, శైలజ, పర్విన్, రెహానా, నాగ పూర్ణిమ, జ్యోతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చెయ్యాలి

## - బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ



మంగపేట, సెప్టెంబర్ 01 (సూర్య సేన): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచెయ్యాలని కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది ఎ హామీలను పూర్తిగా ప్రజలకు అందించకుండా కాలయాపన చేస్తుంది ప్రజా వ్యతిరేక విధానాలే ప్రధాన ఎజెండాగా పోరాటం సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు వాడ వాడానా పల్లె పల్లెల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలను వివరిస్తూ మహిళకు నెలకు 2500 వందలు రూపాయలు సబ్సిడీ గ్యాస్ ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం ఎటుపోయినవి అని, అలాగే తులం బంగారం, మహిళలకు స్కూటీలు, యూరియా కొరత, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసన్ని, ప్రజలకు వివరించాలి,ఈ మోసపూరిత గ్యారంటీ హామీ పథకాలు ప్రజలకు వివరిస్తూ అలాగే తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బిఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలు అభివృద్ధి చేసిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ ఇప్పుడు వచ్చిన ఎన్నికలు మన కొరకు ఈ అవకాశాన్ని వదులుకోకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆదేశాలు పాటిస్తూ మండలంలో 25 గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చెయ్యాలి అని కార్యకర్తలను కుడుముల లక్ష్మీనారాయణ కోరారు.

# నేరేడుచర్ల పాఠశాలలో ఐసిటి కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



నేరేడుచర్ల ప్రతినిధి, సెప్టెంబర్ 01 (సూర్య సేన): పీఎంశ్రీ జడ్పి హెచ్ఎస్ నేరేడుచర్లలో ఐసిటి కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం మండల విద్యాధికారి పి. సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న కంప్యూటర్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విజ్ఞాన సాధనలో ముందుండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ పాఠశాలలో తిరిగి కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం కావడం ఆనందదాయకమని, దీని ద్వారా డిజిటల్ విద్య మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ ఖాన్, శౌరి వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, నరసింహారావు, మాధవి, నాగమణి, అశ్రున్, వెంకటేశ్వర్లు, భానుమతి, జానయ్య, యాదగిరి, బాలు, వినోద్, లాల్సాహెబ్, సరస్వతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో తీసిన గుంతలను వెంటనే పూడ్చాలి కొత్త రోడ్లు వేయాలి

## - సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్



సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 01 (సూర్య సేన): సూర్యాపేట మున్సిపాలిటీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో పట్టణంలో కొత్తగా వేసిన రోడ్లను సైతం పగలగొట్టారని ప్రభుత్వం వెంటనే కొత్త రోడ్లు వేయాలని సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పోరుబాట లో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో కొత్తగా వేసిన రోడ్లన్నీ సైతం వదలకుండా ఇష్టానుసారం రోడ్లను పగలగొట్టి పైపులు వేసిన గుత్తేదారులు దానిపై కొత్త రోడ్డు వేయకుండా వెళ్లిపోయారని అన్నారు. తక్షణమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో పగలగొట్టిన రోడ్లను పునర్నిర్మాణం చేయాలన్నారు. 9వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు గండమల్ల భాగ్యమ్మ, శశిరేఖ, సైదమ్మ, ఎల్లమ్మ, పిట్టలరాణి, పద్మ, వెంకటమ్మ, మారయ్య పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పుట్టినరోజు కానుకగా



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్, -హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మంగళవారం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుండి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. త్రీ పీస్ సూట్, టోపీతో పూర్తిగా నల్లటి దుస్తులు ధరించి పవన్ కళ్యాణ్ చాలా అందంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తన సినిమాలలో హీరోలను అద్భుతంగా చూపించడంలో పేరుగాంచిన హరీష్ శంకర్.. పవన్ కళ్యాణ్ కోసం తనలోని అభిమానిని బయటకు తీసుకువచ్చి, 'ఉస్తాద్ భగత్ సింగ్'లోని ఓ పాట స్టిల్‌తో అభిమానులందరికీ మరిచిపోలేని పుట్టినరోజు విందును ఇచ్చారు. సెప్టెంబర్ 6న ఈ సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు చిత్రీకరణలో పాల్గొంటారు. రాబోయే షెడ్యూల్‌తో టాకీ భాగం దాదాపు పూర్తవుతుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.




## పరమ్ సుందరి హిట్టా ఫట్టా?



జాన్వీ కపూర్ హీరోయిన్ గా సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటించిన "పరమ్ సుందరి" గత వీకెండ్ విడుదలైంది. ఐతే, ఈ సినిమా అనుకున్న రేంజ్ లో కలెక్షన్లను రాబట్టలేదు. జాన్వీ, సిద్ధార్థ్ మల్హోత్రా ఇద్దరూ తెగ టూర్లు వేసి ప్రచారం చేశారు. మొదటి వీకెండ్ ఈ సినిమా ఇండియాలో 27 కోట్లు కొల్లగొట్టింది. జాన్వీ కపూర్ రేంజ్ కి, సిద్ధార్థ్ రేంజ్ కి ఇది మంచి ఓపెనింగ్. ఐతే, ఈ వీక్ మొత్తం ఈ సినిమా నిలబడడం ముఖ్యం. అదే పెద్ద సమస్య. మొదటి వీకెండ్ ఫర్వాలేదు అనిపించుకొంది. వీక్ డేస్ లో నిలబడి మళ్ళీ రెండో వీకెండ్ వరకు బాక్సాఫీస్ బరిలో ఉండగలిగితేనే ఈ సినిమా హిట్ అనిపించుకోగలదు. లేదంటే ఫ్లాప్ కింద జమ కడుతారు. నిజానికి గత వారం హిందీలో కాంపిటీషన్ లేదు. కేరళలో చాలా సినిమాలు విడుదల అయ్యాయి. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కేరళ అమ్మాయిగా నటించింది. అందుకని ఓనం పండుగని దృష్టిలో పెట్టుకొని గత శుక్రవారం రిలీజ్ చేశారు. కానీ కేరళ ప్రేక్షకులు ఈ సినిమాని పట్టించుకోలేదు. జాన్వీ కపూర్ కి హిందీలో పెద్ద హిట్ కొట్టాలన్న కోరిక ఇంకా తీరడం లేదు.

### మరో క్రేజీ ప్రాజెక్టులో రష్మిక..

# ఈసారి భయపెడుతుందట..?



పాన్ ఇండియా సినిమాలతో మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెరీర్‌ని ఎంజాయ్ చేస్తోంది రష్మిక. యానిమల్, పుష్ప-2, ఛావా వంటి హిట్స్‌తో ఈమె రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ప్రస్తుతం రష్మిక నటిస్తున్న చిత్రాల్లో 'ది గర్ల్‌ఫ్రెండ్' ఒకటి కాగా, ఇంకొటి 'థామా'. థామా చిత్రంలో రష్మిక తొలిసారిగా హారర్ పాత్రలో కనిపించనుంది.

స్త్రీ, ముంజియా, బెడియా వంటి సినిమాల ఫ్రాంచైజీలో ఈ సినిమా రాబోతుంది. కొద్ది రోజుల క్రితమే 'ది వరల్డ్ ఆఫ్ థామా' అంటూ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఈ టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఇప్పుడు రష్మిక మరో క్రేజీ ఫ్రాంచైజీలో భాగం కానుందని వార్తలు వస్తున్నాయి. తెలుగు, తమిళ్‌లో 'కాంచన' ఫ్రాంచైజీలో వచ్చిన సినిమాలకు మంచి క్రేజ్ ఉంది.

కొరియోగ్రాఫర్, హీరో రాఘవ లారెన్స్ తెరకెక్కించిన ఈ ఫ్రాంచైజీలో వచ్చి ముని, కాంచన, కాంచన-2 (గంగా), కాంచన-3 సినిమాలు మంచి సక్సెస్ సాధించాడు. ఈ వరుసలో వస్తున్న మరో చిత్రం కాంచన-4. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది.

ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోందని ఇదివరకే ప్రకటించారు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో రష్మిక కూడా నటిస్తోందని వార్తలు వస్తున్నాయి. అది కూడా దెయ్యం పాత్రలో అని తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కానీ, ఇదే నిజమైతే.. కాంచన-4 క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోతుంది.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com

www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com